నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

నమ్మలేని నిజాలు

కృత్రిమ మేధ
జనం ప్రగతి బాట
కొత్త పుంతలు

ఇల్లు కావాలి
పక్షులకు గూడుల
అల్పసంతోషి.

కనక వర్షం
మద్యం సీసాలు ధ్వంసం
నిషేధం శేషం.

పంటనాశనం
రైతుకంట కన్నీరు
పరద జోరు.

ఆకురాలింది
రాజకీయ శిశిరం
చెన్నైలో అన్నా!

– రేడియమ్
సెల్: 9291527757

నిజాయి

కిందివాళ్ళు పైవాళ్ళకు
జోడింత్రు అంజలే !
పైవాళ్ళూ ఎరికివాళ్ళు
గురివింద గింజలే !

అవినీతి పరులు పెట్టుట
అన్నం కాదోయ్ సున్నం !
పాలకులు తవ్వుకున్నది
వెతకాలి వాళ్ల కన్నం !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 4-8-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 2 పేజీలు:6 వెల: రూ.1/-

పటాన్‌చెరులో 30 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి : మంత్రి మల్లారెడ్డి

సంగారెడ్డి, ఆగష్టు 3: (నేటినిజం ప్రతినిధి): పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో పని చేస్తున్న కార్మికులను దృష్టిలో ఉంచుకొని.. ఇక్కడ 30 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి, డిస్పెన్సరీని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి బుధవారం ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని ఆర్‌సీపురంలో ఈఎస్ఐ హాస్పిటల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ విషయాన్ని మంత్రి మల్లారెడ్డి వెల్లడించారు. ఈ ఆస్పత్రి నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే 2 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించిందని గుర్తు చేశారు. పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో సుమారు 2 లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే లక్షలాది మంది కార్మికులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

ఆర్‌సీపురం ఈఎస్ఐ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

రామగుండంలో ఘనంగా జరిగిన శ్రీపదాలు ద్వితీయ వార్షికోత్సవం

అనుశ్రీ గౌరోజు నాగానూగూరి రచనల ఆవిష్కరణలో ఎమ్మెల్యే కోరుగంటి చందర్, మౌనశ్రీ మల్లిక్, డా॥ సుద్దాల అశోక్‌తేజ తదితరులు

రామగుండం పారిశ్రామిక ప్రాంతం ఎంతో మంది కవులకు, కళాకారులకు పుట్టినిల్లనీ, వారిని ప్రోత్సహించే బాధ్యత తాము తీసుకుంటామని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. మార్కండేయ కాలనీలోని శ్రీలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన శ్రీ పదాలు ద్వితీయ వార్షికోత్సవ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్థానిక కవయిత్రి అనుశ్రీ గౌరోజు రచించిన గగనం, దోసిట్లో చందమామ, శ్రీపద సౌరభం, నాగా నూగూరి రచించిన నాగాక్షరాల తేజం సంకలనాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ కారులను ఉత్తేజపరిచిన విధంగా తమ ఆట పాట, మాటలతో స్థానిక కళాకారులు రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని తెలంగాణకే దిక్సూచిగా నిలిపారన్నారు. కవులు, కళాకారుల పాత్ర గణనీయమైందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను పలువురు సన్మానించారు. స్థానిక టీఆర్ఎస్ నాయకులు, సాహిత్యాభిమాని జేవీ రాజు, ప్రముఖ సినీ గేయ రచయితలు సుద్దాల అశోక్‌తేజ, మౌనశ్రీ మల్లిక్, కార్పొరేటర్లు పెంట రాజేశ్, జంజర్ల మౌనిక, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వంశీ, దయానంద్ గాంధీ, నూతి తిరుపతి, పలువురు కవులు, కవయిత్రులు వైరాగ్యం ప్రభాకర్, దాస్యం లక్ష్మయ్య, సంపత్‌కుమార్, శ్రీనివాస్, గుండేటి రాజు, లలిత, ఉషశ్రీ, వకుళ వాసు, స్వాతి కృష తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర మంత్రులది పూటకో మాట : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగష్టు 3: కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్రమంత్రులు పూటకో మాట్లాడుతున్నారని, వారిది పార్లమెంట్‌లో ఓ మాట ప్రజాక్షేత్రంలో ఓ మాట, ఢిల్లీలో ఓ మాట.. గల్లీలో ఓ మాట అంటూ రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. మేడ్చల్‌లో 50 పడకల ఎంసీహెచ్ దవాఖానకు హరీశ్‌రావు కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. గజేంద్ర సింగ్ షెకావత్ అనే కేంద్ర మంత్రి వచ్చిండు.. ఆయనది ఢిల్లీలో ఓ మాట.. పార్లమెంట్‌లో ఓ మాట అని విమర్శించారు.

కేంద్రమంత్రి పార్లమెంట్‌లో ఓ మాట.. గల్లీలో ఓ మాట..

కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం అన్ని అనుమతులు ఇచ్చిందని, 18 లక్షల కొత్త ఆయకట్టు, మరో పద్దెనిమిదన్నర లక్షల ఎకరాలకు స్థిరీకరణ చేసే ప్రాజెక్టు అని, కాళేశ్వరం ప్రాజెక్టులో ఎలాంటి అవినీతి జరగలేదని లేదని పార్లమెంట్‌లో చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. బీబీనగర్‌లో కేంద్రమంత్రి కాళేశ్వరానికి అనుమ తులు లేవంటాడని, ఫారెస్ట్, ఎన్విరాన్ మెంట్ క్లియరెన్స్ లేదంటున్నాడని, అవినీతి జరిగిందంటున్నాడని ధ్వజమెత్తారు. ఐదు నెలల కిందట పార్లమెంట్‌లో ఏం చెప్పారు? ఇప్పుడు అబద్ధాలు చెబుతున్నారు? కాళేశ్వరం ప్రాజెక్టు అన్ని అనుమతులు ఉన్న కాగితాలు తెచ్చా.. సెంట్రల్ వాటర్ కమిషన్ అన్ని అనుమతులు ఇచ్చిందని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

కేంద్రం ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ 2017, 22 డిసెంబర్ ఇచ్చిందని, అటవీ శాఖ అనుమతి 2017, నవంబర్ 24న వచ్చిందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. అనుమతి ఇచ్చేది వాళ్లేనని.. ఇక్కడకు వచ్చి అనుమతి లేదంటున్నారని.. అది నోరా.. మోరీనా అంటూ మండ పడ్డారు. గల్లీలో ఓ మాట.. ఢిల్లీలో ఓ మాట.. పార్లమెంట్‌లో ఓ మాట.. ప్రజాక్షేత్రంలో ఓ మాట మాటాడు తున్నారంటూ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు లైఫ్ లైన్ అని, తెలంగాణకు గొప్ప ప్రాజెక్టు అని స్పష్టం చేశారు. మేడ్చల్ నియో జకవర్గంలో, శామీర్‌పేట చెరువులో రెండు మూడు నెలల్లో నీళ్లు వస్తా యన్నారు. రావల్ కోల్ కెనాల్ ద్వారా మేడ్చల్‌కు కాళేశ్వరం నీళ్లు వస్తాయ న్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీరు వస్తుంటే కళ్లు మండుతున్నాయని ఆరోపించారు. కేంద్రమంత్రి మూడు నెలల కిందట శంషాబాద్ వచ్చిండని, కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు గ్రోత్ ఇంజిన్ అన్నాడని, దీంతో తెలంగాణ సస్య శ్యామలం అన్నాడని గుర్తు చేశారు. ఏదో రకంగా రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ నేతలు అబద్ధాలు ఆడుతున్నారని, వంద అబద్ధాలు ఆడి పెళ్లి చేయాలన్నారు కానీ.. బీజేపీ వాళ్ల కథ వంద అబద్ధాలు ఆడి అయినా అధికారంలోకి రావాలన్నట్లుగా ఉందని విమర్శించారు.

ప్రణాళికతో చదివితేనే విజయం మీదే

నిరంతర సాధనపై దృష్టి పెట్టాలి..పట్టుదలతో ఇష్టపడి చదవాలి..
చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది– రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి.
కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉద్యోగార్తులకు అవగాహన సదస్సు

కామారెడ్డి, ఆగష్టు 3 (నేటినిజం ప్రతినిధి): ప్రణాళికతో చదివితే విజయం మీదే అవుతుందని, పట్టుదలతో ఇష్టపడి చదవాలని, అంకిత భావంతో చదువుతేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి సూచించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళాభారతి మందిరంలో బుధవారం పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మార్గ నిర్దేశం చేశారు. ఉద్యోగ సాధనలో భాగంగా నిరుద్యోగ అభ్యర్థులు పాటించవలసిన మెలకువలను అర్థవంతంగా ఆకట్టుకునే రీతిలో వివరిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే ప్రయత్నం చేశారు. తన స్వయ అనుభవాలను జోడించి పలు అంశాలపై అవగాహన కల్పించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టుదలతో శ్రమిస్తే విజయం తథ్యమవుతుందన్నారు. అపజయం ఎదురైనంత మాత్రాన ప్రయత్నించడం ఆపకూడదని ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమై కోరుకున్న ఉద్యోగం సాధించాలని నిరుద్యోగులకు దిశ నిర్దేశం చేశారు. సిలబస్ పై పట్టు కలిగి ఉండాలని సూచించారు. పాత ప్రశ్న పత్రాలను విశ్లేషించుకుంటూ, పరీక్ష విధానానికి అనుగుణంగా సిద్ధం కావాలని పేర్కొన్నారు. అనవసర సోషల్ మీడియా కు దూరంగా ఉండాలన్నారు. పోటీ పరీక్షల వాతావరణంలో ఏకాగ్రతతో సిద్ధం కావాలని కోరారు. పరీక్షల్లో ప్రతి ప్రశ్న కీలకమని, ప్రిపరేషన్లు నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. ఉద్యోగ సాధనలో ఎదురయ్య అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు పోవాలని కోరారు. గతంతో పోలిస్తే ఈసారి అభ్యర్థులకు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని సద్వినియోగం చేసుకొని కొలువు దక్కేలా కృషి చేయాలని సూచించారు. తమపై తాము గట్టి నమ్మకంతో కష్టపడ్డప్పుడు విజేతలు అవుతారని పేర్కొన్నారు. యువత దురాలవాట్లకు దూరంగా ఉంటూ మానసిక ఒత్తిడిని అధిగమిస్తూ ముందుకు సాగాలని కోరారు. ఏకాగ్రత, స్థిరత్వంతో విషయపరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటూ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. పోటీ పరీక్షల్లో భయం వీడితే విజయం సాధించడం సులభం అవుతుందని చెప్పారు. బట్టి విధానానికి స్వస్తి పలికాలన్నారు. పోటీ పరీక్షల్లో రాణించేలా అన్ని సబ్జెక్టులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనవసర విషయాల గురించి ఆలోచిస్తూ సమయం వృధా చేయకుండా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించడంపైనే దృష్టి సారించాలని ఉద్బోధించారు. ప్రతి ఒక్కరు ఏదో ఒక నైపుణ్యం, శక్తి, సామర్థ్యం ఉంటుందని, తమ మీద తాము నమ్మకం ఉంచి కష్టపడ్డ వారే విజయం సాధిస్తారని తెలిపారు. వివిధ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వం నుంచి వస్తున్న నోటిఫికేషన్ లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇదో సువర్ణ అవకాశమని, ఇలాంటి అవకాశం మళ్ళీ రాకపోవచ్చు అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ విప్లవం వచ్చిందని, ఇప్పటికే గ్రూప్ 1, ఆర్టీసీ, ఎస్సై, కానిస్టేబుల్ నోటిఫికేషన్లు వచ్చాయని చెప్పారు. త్వరలోనే గ్రూప్– 2,4 ఇతర ఉద్యోగ ప్రకటనలు కూడా రానున్నాయని వివరించారు. గ్రూప్ –1 కు సంబంధించి ప్రిలిమినరీ, మెయిన్స్ లో అడిగే ప్రశ్నలు, అందుకోసం అభ్యర్థులు ఎలా చదవాలో విశ్లేషణాత్మకంగా తెలియజేశారు. బట్టి పద్ధతి కి స్వస్తి పలికాలన్నారు. సమగ్రంగా అధ్యయనం చేయాలని, చదివిన అంశాలను అర్థం చేసుకొని అవగాహన చేసుకోవాలన్నారు. అభ్యర్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. పక్క ప్రణాళికతో సంసిద్ధులైతే ఉద్యోగం సాధించడం సులభం అవుతుందని చెప్పారు. ఏకాగ్రతతో చదివి యువతి, యువకులు తాము కోరుకున్న ఉద్యోగాన్ని దక్కించుకొని బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. వివిధ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఎస్సీ, బీసీ, మైనార్టీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు స్టడీ మెటీరియల్ కూడా అందజేస్తున్నామన్నారు. అభ్యర్థులు నోటిఫికేషన్లు వెలువడినప్పుడు చూపిన ఉత్సవాన్ని పరీక్ష పూర్తి చేసే వరకు నిరంతరం కొనసాగించాలన్నారు. సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ లావణ్య మాట్లాడారు. సౌత్ క్యాంపస్ అభివృద్ధికి అప్పటి తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పార్థసారథి చేసిన కృషిని కొనియాడారు. సౌత్ క్యాంపస్ లోపలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఏఎస్పీ అన్యోన్య, ఆర్డీవో వాణి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కిష్టయ్య పాల్గొన్నారు.

ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు ..పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి

పెద్దవంగర మండల కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరై గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ హాస్పిటల్లోనే చూపించుకోవాలని సుఖ ప్రసవాలు జరుగుతాయని అన్నారు. తల్లి పాలు తాగడం వలన పిల్లల ఎదుగుదల బాగుంటుంది అని అన్నారు. తద్వారా మాత శిశు మరణాల రేటు తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెనుకదాసుల లక్ష్మి, పాలకుర్తి దేవస్థాన పాలక మండలి చైర్మన్ రామచంద్రయ్య, జెడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి, ఎంపిపి ఈదురు రాజేశ్వరీ, స్థానిక ఎంపిటిసి ఏదునురి శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ ఖుర్షీద్, ఎంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి, ఐసిడిఎస్ పిఓ,ఐసిడిఎస్ సూపర్ వైజర్ కవిత, అంగన్వాడి టీచర్స్ పసుల స్వరూప,తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో నాలుగు రోజులు అతిభారీ వర్షాలు.. ఆరెంజ్ అలెర్ట్ జారీ

హైదరాబాద్, ఆగష్టు 3: రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతవరణ కేంద్రం హెచ్చరించింది. బుధవారం నిర్మల్, నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అతి భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. 5న కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, వలుచోట్ల ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. 5న కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. 6న రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, సిద్ధిపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. అలాగే గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

'ఆజాదీ కా అమృత్' ప్రచారం ప్రారంభం

ఆజాదీకా అమృత్ మహోత్సవాల ప్రత్యేకత, ఇంటింటికి జెండా పండుగగా జరుపుకునే విషయాల గురించి తెలియజేసే ప్రచార కార్యక్రమం మంగళవారం ప్రభాదేవి ఖేడ్‌గల్లీలో ప్రారంభించారు. తెలుగు సమాజ్ సేవా సంస్థ వ్యవస్థాపకులు, సమాజ సేవకుడు, ప్రముఖ సిద్ధివినాయక మందిరం నిత్య సేవకులు కట్కం రాజన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా స్వాతంత్ర్య సమరయోదుడు, జాతీయ త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. ఆయన సేవను గుర్తు చేసుకున్నారు. అనంతరం జాతీయ పతాకం రంగులో ఉండే స్వీట్లను పంచి పెట్టారు. ఈసందర్భంగా 77 వసంతంలో అడుగుపెట్టిన ప్రముఖ కవి, రచయిత యెల్లా సుదర్శన్‌ను, 55 వసంతాలు పూర్తి చేసుకున్న సినీ చిత్రకారుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహిత రాంపెల్లి రాజ్‌పాల్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు చిట్టా ఆనంద్, ప్రధాన కార్యదర్శి కటర్ల గణేశ్, వ్యవస్థాపకుడు కట్కం రాజన్న, వివిధ తెలుగు సంఘాలకు చెందిన ప్రముఖులు పోతు రాజారాం, భోగ సహదేవ్, గుర్రం మధుసూదన్, ఎల్లప్ప, గంగాధర్, బండి భాస్కర్, రవి, రామలింగం, రవి, పురుషోత్తం, కైలాస్, కటర్వినోద్, హర్ష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సిటీ పోలీసు శాఖ కీలక నిర్ణయం

హైదరాబాద్, ఆగష్టు 3: హైదరాబాద్ సిటీ పోలీసు శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మారేడ్‌పల్లి ఎస్ఐపై కత్తి దాడి ఘటన తర్వాత పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఎస్ఐ ఆపై ర్యాంక్ పోలీసు ఆఫీసర్లకు వెపన్ ఇవ్వాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న వెపన్స్‌ని ఎస్ఐ ర్యాంక్ అధి ఓకారికి సైతం ఇవ్వాలని ఆదేశించారు. నిన్న రాత్రి మారేడ్‌పల్లి ఎస్ఐ వినయ్ కుమార్‌పై పాత నేరస్తులు దాడి చేసి గాయపరిచిన సంగతి తెలిసిందే. ఇటీవల మాదాపూర్ సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ యాదయ్యపై కూడా చైన్ స్నాచర్లు దాడి చేశారు. ఈ దాడుల నేపథ్యంలో పెట్రోలింగ్ టైంలో నేరగాళ్ల నుంచి రక్షణ పొందేందుకు గన్స్ ఇవ్వాలని పోలీసు శాఖ నిర్ణయించింది. ఇప్పటికే సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ప్రతి ఎస్ఐ వెపన్ క్యారీ చేయాలని సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలు జారీ చేశారు.

మంగళవారం రాత్రి 2 గంటల సమయంలో మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ వినయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బైక్‌పై వస్తున్న ఇద్దరిని ఎస్ఐ ఆపి ప్రశ్నించారు. అయితే వారిలో ఓ వ్యక్తి తన వద్ద ఉన్న చిన్న కత్తితో ఎస్ఐ వినయ్‌కుమార్ కడుపులో పొడిచాడు. అనంతరం వారు అక్కడి నుంచి పరారయ్యారు.

ఆగస్టు 5 నుంచి 15 వరకు అన్ని మ్యూజియంలలో ప్రవేశం ఉచితం

హైదరాబాద్, ఆగష్టు 3: భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు కొనసాగుతోన్న విషయం విదితమే. అయితే ఆగస్టు 5 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్రంలో భారత పురావస్తు శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతోన్న అన్ని మ్యూజియంలు, ఇతర పర్యాటక ప్రాంతాల్లో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. స్వదేశీయులతో పాటు విదేశీయుల నుంచి ఎలాంటి ప్రవేశ రుసుము వసూలు చేయబోమని స్పష్టం చేశారు. గోల్కొండ, చార్మినార్‌తో పాటు ఇతర సందర్శన ప్రదేశాలను పర్యాటకులు ఉచితంగా చూడొచ్చని అధికారులు పేర్కొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రారంభించిన మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట, ఆగష్టు 3: బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా కూడా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించిన దాఖలాలు లేవు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 60 వేల రూపాయలు ఇస్తే ఆ డబ్బులు బేస్మెంట్ కూడా సరిపోయేవి కావని వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు.

బుధవారం ములుగు మండలం నాగిరెడ్డిపల్లె గ్రామంలో లబ్ధిదారులతో డబుల్ బెడ్ రూం ఇండ్ల గృహ ప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పైసా ఖర్చు లేకుండా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టి నిరుపేదలను కొత్తింట్లోకి తోలడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

నాగిరెడ్డిపల్లి గ్రామ దశదిశ మారిందని, ఇప్పటికే గ్రామాభివృద్ధికై రూ.8.30 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేశామని మంత్రి చెప్పుకొచ్చారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక చేపట్టిన సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం, సాగునీటి, తాగునీరు అనేక సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆయన తెలిపారు.

పాఠ్యపుస్తకాలు యూనిఫాం పంపిణీ చేసిన మంత్రి పువ్వాడ..

ఖమ్మం, ఆగష్టు 3: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం విద్యను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని, అందులో భాగంగా ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టిందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

బుధవారం ఖమ్మం కార్పోరేషన్ వెలుగుమట్ల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ద్విభాషా (ఇంగ్లీష్ ఉ తెలుగు) పాఠ్యపుస్తకాలు, యూనిఫాం ను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ విద్యార్థినిలకు పంపిణి చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచి బోధనకు చిరునామా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని అన్నారు. ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి అంటే మంచిగా చదువుకోవాలి, స్వశక్తితో ఎదగాలని ఆకాంక్షించారు. ఇప్పుడు చదువుకునే విద్య మాత్రమే ఫౌండేషన్ గా నిలబడుతుంది అని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్య మాత్రమే మనలను అనుకున్న లక్ష్యం వైపుకు చేర్చుతుంది అని అన్నారు. మొత్తం 364 మంది విద్యార్థినిలకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణి చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. భోజనం, అల్పాహారం సరిగ్గా అందుతుందా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు.


భాషా సాంస్కృతిక శాఖ నిర్వహణలో
రెండు గ్రంథాల ఆవిష్కరణ
డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు సంపాదకత్వంలో
'భావదర్పణం' కవితా సంకలనం ఆవిష్కరణ
డా. చిదెళ్ల సీతాలక్ష్మి రచించిన
'సీతమాట' ద

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 4-8-2022

"ఒక సాహసి ఆలోచన" పుస్తకాన్ని ఆవిష్కరించిన కేసీఆర్

అలజడులు, అందోళనలు లేని మానవీయ సమాజాన్ని నిర్మించుకోవడానికి మనమంతా కంకణదారులం కావాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అన్నారు. మంగళవారం ప్రగతిభవన్‌లో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ వెలువరించిన "ఒక సాహసి ఆలోచన" పుస్తకాన్ని కేసీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో మతసామరస్యం వెల్లివిరిసినప్పుడే అభివృద్ధి పథంలో దూసుకుపోతామని అన్నారు. మానవ సంపదను శక్తివంతంగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

కలలసాగు

వర్ణ రాగరంజితమై
వెలగాలనుకుంటాడతను
వేపుకుతిన్న క్షణాల సాక్షిగా
వేడుకను వెతుకుతుంటాడు

వలపుమాయ డబ్బు మాయ
అధికారహంకారం
నా అనుకున్నవాళ్ళందరి దగ్గర
చూసేశాడు
ఎదిగామనుకున్నారు
ఎగిరిపోయారంటాడు

అందరికీ దూరంగా
నదీగమనాన్ని చూస్తూనో
ఏటిపాట వింటూనో
తనలోకి తాను ప్రయాణిద్దామనుకుంటాడు

పాడు జీవితం
పట్టి ఆపేస్తుందంటాడు
కాడెద్దులా బాధ్యతల బండిని లాగేవాడికి
శాంతెక్కడ.. విశ్రాంతెక్కడ అంటాడు.

అందుకే ఆకాశం కప్పుకింద
సంతోషాల మగ్గం నేస్తుంటాడు
మగ్గుతున్న నిరాశను విడుదల చేస్తుంటాడు
జారే వాన నీటిబొట్టులో
కలలసాగు చేస్తుంటాడు

-సి.యస్.రాంబాబు
8374818961

పుస్తక సమీక్ష

నీలోత్పల కవి యార్లగడ్డ కవితా సంపుటి స్రోతస్విని

నీలోత్పల కవిగా సుపరిచితులైన యార్లగడ్డ మోహనరావు నదీ ప్రవాహం పేరిట 'స్రోతస్విని' కవితా సంపుటిని కవితా హృదయంతో ఆవిష్కరింప చేసారు. గోదావరిని కవులు, గంగా నదిని యోగులు, కృష్ణవేణిని శిల్పకళా కారులు, కావేరిని సంగీత రసజ్ఞులు అంటూ సంభావింపచేయటం తొలి కవితలోనే కవి, భావ వైభవాన్ని దర్శింపచేస్తోంది. ఈ సంపుటిలో, సుమారుగా 66 కవితలు న్నాయి. కవితా మార్మికత లేకుండా సూటిగా, సరళంగా, వచన రీతిలో కవిత్వం సాగిపోతుంది. 'నీరు-మీరు' చివరి కవితలో "హిమాలయాలు ఇప్పటికే కరిగిపోతున్నాయి అంటూ నీటి వృథా అరికట్టాలని, అవసరానికి మించి నీటిని వాడటం నేరమని, విపరీత జనాభాయే దీనికి కారణమని స్పష్టంగా చెప్తారు. 'కిన్నెర సారి' కవితలో ఇపుడు, ఏడుపాయల గోదావరి మూడుగా మిగిలిందని, అదే విధంగా, కులాలు కలిసిపోయి కులం లేని వేశ్యలెందరో వున్నారంటారు. 'కిన్నెర సాని'లో వున్న మాట 'సాని' దృష్టిలో పెట్టుకొని, 'పెళ్ళి చూపులు' కవితలో "ఎంతమంది అమ్మాయిలు మనసు చంపుకుని కాపురాలు వెలగబెడుతున్నారో" అంటూ అమ్మాయిలు ధైర్యంగా భర్తను ఎంచుకొనే స్వేచ్ఛ సమాజంలో రావాలని అభిలషిస్తారు. కరోనా కల్పించిన దుస్థితిని కవి మోహనరావు, ప్రభుత్వం శవాలను ఇవ్వడం లేదని ఆరోపిస్తారు. నిష్ఠూరం కవితలో దైవమాయను ప్రశ్నిస్తాడు. తెలుగులో ఓ అమృతం, మహిళా దినోత్సవం, అఘాయిత్యాలు, ఇలాగే ఉంటాం, వంటి పలు కవితలలో సూచనలు, సలహాలు, సందేశాలు పుష్కలం గా అందించారు.

"కుల మతాలనే గాడిదలపై తుచ్ఛ ఆచారాలనే మాటలు వేసి మానవ పొలిమేరలు దాటించ మంటాను" అంటారు. సామాజిక స్పృహతో కవి "ముగింపు' అనే కవితలో "మోహనరావు గారి పేరు కొంత కాలానికి మర్చిపోతారు. రాజమండ్రి నన్ను భరించింది. పోషించి వదిల సింది". కవిగా మోహనరావు ఏమీ దాచుకోకుండా, అసంతృప్తిని, నిరాశను వ్యక్తపరిచే స్వకీయ ఆలోచనానుభవాల కవిత్వాన్ని, ప్రవాహంలో మునకలు వేస్తూ ఆవలిగట్టుకు చేరే తీరం అన్వేషిస్తున్నారు. స్రోతస్విని సంపుటి శీర్షికా చిత్రం ఆకర్షణీయంగా వుంది యార్లగడ్డ కవిగా అభినందనీయులు.

ప్రతులకు: యార్లగడ్డ మోహనరావు
రిటైర్డ్ హెడ్ మాస్టర్,
ఇ.నెం. 45-4-5ఆంధ్రనగర్,
బైపాస్‌రోడ్, రాజమండ్రి-3
(తూ॥గో॥జిల్లా) ఆంధ్ర.

-జయసూర్య
సెల్: 9440664610

రుంధా రుబాయిలు

అహింసయే ఆయుధమని నినదించే నా రుంధా
అఖిల శాంతి సౌభాగ్యం కోరిందే నా రుంధా
కులమతాలు ఏవైనా జాతి ఒక్కటేనంటూ..
ఎర్రకోట బురుజుపైన ఎగిరిందే నా రుంధా !!

ఎన్నిఎన్ని బాధలెన్ని చేరినాయె నా రుంధా..
ఆకలికేకల మధ్యన ఎగిరినావె నా రుంధా
కడుపునిండబోదు కంటితుడుపుకూడా సంక్షేమం..
పేదవాడి కంటనీట తడిసినావె నా రుంధా !!

-పేరిశెట్టి బాబు
9247170800

వజ్ర భారతి

చీకటిలోంచి వెలుగు లోకి
ప్రయాణించడమే జీవితం
బానిస బతుకుల్ని చేధించి సాధించిన
ఇచ్ఛా వాయువుల స్వేచ్ఛే
స్వాతంత్ర్యం-
నా దేశం
ఒక త్యాగ జ్వలిత
ఒక అగ్ని పునీత
ఒక విశ్వ విజ్ఞాన వేదిక
పింగళి వెంకయ్య
త్రివర్ణ పతాక
విశ్వ శాంతి చైతన్య దీపిక.

- వి.. సూర్యారావు
9246911234

జాతీయ జెండా

పిలుస్తోంది..పిలుస్తోంది
మువ్వన్నెల జెండా
జయహో..జయహో..
అంటూ జాతీయ జెండా "పిలుస్తోంది"
కథం త్రొక్కుతూ...పదం పాడుతూ
ఎదనిండా దేశ భక్తి ఉప్పొంగి పోతూ
కదలిరండి..కలసి రండి భారతీయులారా
ప్రపంచాన మన కీర్తిని చాటి చెప్పరారా
' పిలుస్తోంది"
గతం స్మరిస్తూ...ఘనం స్తుతిస్తూ
మదినిండా త్యాగనిరతి గుర్తుతెచ్చుకుంటూ
కదలి రండి..కలసి రండి భరత బిడ్డలారా
సరిహద్దున మన జెండా ఎగురవేయగ రారా
-"పిలుస్తోంది"

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

సకల కళావల్లభుడు రవీంద్రనాథ్ ఠాగూర్

"అబద్ధం గురించి కూడా నేను తప్పక నిజమే పలుకుతాను'' ఈ మాటన్నది ఎవరో కాదు కవి,రచయిత ,విద్యావేత్త, తత్వవేత్త, సంఘ సంస్కర్త ,చిత్రకారుడు భిన్న కళల యందు అధ్భుతమైన ప్రతిభతో అంతర్జాతీయ ఖ్యాతిని గడించిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్. (1861 మే 7-1941 ఆగస్టు 7) ప్రపంచం లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డు లలో ఒకటైన 'నోబెల్'పురస్కారమును ఆసియాఖండము లోనే మొట్టమొదటిసారిగా 1913 లో అందుకున్న యూరోపియన్ కాని ఏకైక భారతీయుడు రవీంద్రనాథ్ ఠాగూర్ తన "గీతాంజలి"' కావ్యానికి- రవీంద్రుడు తన 8వ ఏటనే ' భానుసింహ' అనే పద్యసంపుటి రాసారు. ఆ తరువాత కాలంలో కాళిదాసు తదితర కవుల సాహిత్యాన్ని చదివి రాయడం కూడా ప్రారంభించారు. తరువాత బారెట్లా చదవడానికి ఇంగ్లండ్ వెళ్ళినా అక్కడ చదువు సాగలేదు. ఎందుకంటే వీరి ధ్యాసంతా సాహిత్యం వైపే. అక్కడ షేక్స్పియరు తదితర ఆంగ్ల కవుల సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. స్వదేశానికి చేరుకున్న తరువాత మరింతగా సాహిత్యానికి ఆకర్షింపబడ్డారు రవీంద్రుడు. కలకత్తా లో కొంతకాలం గడిపిన పిమ్మట కొన్ని దుర్ఘటనలు చోటు చేసుకున్నాయి, తన ఇద్దరు పిల్లలు పరమపదించడం మరికొంత కాలానికి తన భార్య పోవడంతో బాగా కృంగి పోయి తన మకాం తండ్రి స్థాపించిన "శాంతిని కేతన్"కు మార్చినారు. తన తండ్రి కూడ చనిపోవడంతో మానసికంగా కొంత విరక్తికి లోనయి తన సంపదంతా వదిలేసి కేవలం తన రచనలకు రాయల్టీ గా వస్తున్న 2వేల రూపాయలతో సామాన్యంగా జీవించారు. బహుశా ఆ జీవితమే భవిష్యత్ లో సామాన్యులకు చేరువ చేసి తాత్వికత్వాన్ని కలిగించి అధ్భుతమైన రచనలకు ఉపక్రమింపజేసిందేమో. రవీంద్రుడు తన 70 వ ఏట చిత్ర లేఖన సాధన మొదలు పెట్టాడు.విచిత్రమేమిటంటే కొద్ది కాలంలోనే ప్రముఖ చిత్రకారుని గా రూపొంది సుమారు రెండువేల చిత్రాలను గీశారు అవి లండన్, న్యూయార్క్ వంటి విదేశాలలో ప్రదర్శింపబడ్డాయి. దీనిని బట్టి వారి పట్టుదల, ఏకాగ్రత వ్యక్తమౌతుంది వారికి దేశభక్తి మెండు అనడానికి ఒక గొప్ప సంఘటన చెప్పుకొనవలసిన అవసరముంది. బ్రిటిష్ మహారాణి ప్రతిష్టాత్మక మైన "నైట్" అనే బిరుదును రవీంద్రునికి బహూకరించిది. అదే సమయంలో జలియన్ వాలాబాగ్ దుర్ఘటనలో వేలాది భారతీయులు కాల్చివేయడ్డారు. దీనికి తీవ్రంగా స్పందించిన ఠాగూర్ ఆ బిరుదును తిరస్కరించారు.రవీంద్రుని అనేక కావ్యాలు ప్రపంచ ప్రసిద్ధి పొందినాయి. వాటిలో గీతాంజలి ప్రథమ స్థానంలో వుంది. ఇంకా గోరా, స్వప్నభంగ, సంగీత ప్రభాత కొన్ని నాటకాలు వాల్మీకి ప్రతిభ, చిత్రాంగద కచదేవయాని, ముక్తిధార వంటివి ఎన్నో వున్నాయి. 1910 ఆగస్టు 14 న ప్రచురితమైన గీతాంజలి కావ్యం 103/157 పద్యముల సంకలనం. ఆంగ్లంలో "song offerings"ః (గీతాంజలి) గా ప్రపంచములోని దాదాపు అన్ని భాషల లోనికీ అనువదించబడింది. ఈ గ్రంథాన్ని చదివిన స్వదేశీయులే గాక విదేశీయులు కూడా రవీంద్రుని సాహిత్యాభిమానులయ్యారు. మనిషి ఆశ నిరాశలమధ్య ఘర్షణలు, ప్రేమతత్వబోధన , 'శ్రమ' గొప్పతనాన్ని ప్రబోధించే సువిశాల వేదికను నిర్మించిన మహా కావ్యం. ఈ కావ్యాన్ని తెలుగీకరించిన మన కవులు గుడిపాటి వెంకటాచలం, రాయప్రోలు, కె. వి. రమణారెడ్డి, శంకరంబాడి సుందరాచారి, బెజవాడ గోపాల రెడ్డి, కొంగర జగ్గయ్య మొదలగువారు ముఖ్యులు. సర్వ మతాలకు అతీతమైన బ్రహ్మం ఒక్కటేనని పప్రచారంచేసి ' విశ్వకవి" "గురుదేవ్" అన్న బిరుదులను సార్థకం చేసుకున్న ధన్యజీవి రవీంద్రుడు. వారిని ఏ కోణము నుండి పరిశీలించినా ఒక జ్ఞాన భాండాగా రమని రూఢి అవుతుంది. రవీంద్రుని వ్యాఖ్యలు మచ్చుకు కొన్ని..... పర భాషా బోధన అంటే మెట్లు లేని సౌధం లాంటిది/ ప్రేమించే వ్యక్తికి దండించే అధికారం వుంటుంది/ మంచి పనులు చేస్తూ తీరిక లేనివ్యక్తికి సుఖం గా జీవించడానికి కాలం దొంకదు/ ప్రేమగుణం బాగా పెరిగితే లభించే సంపద -- పవిత్రత/ ఇత్యాది అమృత వాక్కులను అనుభవ పూర్వకంగా చెప్పినారు. వారి భారతీయతకు ఉత్తమ తార్కాణం మనం నిత్యం పాడుకుంటున్న "జనగణమన" మన జాతీయగీతం వారి కలం మన కిచ్చిన వరం. ఇందుకు ప్రతి భారతీయుడూ నిరంతరం స్మరించుకోనడమే "విశ్వ కవి''కి మనమిచ్చే ఘన నివాళి. 'మేరుశిఖ రాన్ని! అద్దంలో చూపించడం సాధ్యమా!

(విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి ఆగస్టు 7 సందర్భంగా)

మాయకుంట్ల నారాయణరెడ్డి
9989686603

వడ్డేపల్లి "మర్యాద రామన్న కథలు" ఆవిష్కరణ మరియు కలహంసి ప్రతిభా పురస్కారాల ప్రదానం



'మర్యాద రామన్న' కథలు పుస్తకావిష్కరణలో డా॥ మరిగంటి లక్ష్మణాచార్య, బైస దేవదాసు, దాసరి వెంకటరమణ, డా॥ వడ్డేపల్లి కృష్ణ, డా॥ వకులాభరణం కృష్ణమోహన్, కళా జనార్ధనమూర్తి, డా॥ తిరుమల శ్రీనివాసాచార్య, డా॥ఎన్.చిత్తరంజన్, గంజి సత్యనారాయణ

త్యాగరాయ గానసభా ప్రాంగణ మందలి "కళా సుబ్బారావు కళా వేదిక"లో డా॥ వడ్డేపల్లి కృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని గతరాత్రి ఆయన రచించిన "మర్యాద రామన్న కథలు"ను ముఖ్య అతిథిగా విచ్చేసిన బి.సి. కమీషన్ ఛైర్మన్ డా॥ వకుళాభరణం కృష్ణమోహన్ ఆవిష్కరించారు. "తనదైన వివిధ్ష శైలిలో బాలలకు ఆసక్తికరంగా, నీతిబోధకంగా మర్యాదరామన్న కథల్ని రచించిన వడ్డేపల్లి కృష్ణ అభినందనీ యులన్నారు. అధ్యక్షత వహించిన కళా జనార్ధనమూర్తిగారు మాట్లాడుతూ సి.నా.రెగారి సీనియర్ శిష్యులు అయినట్టి వడ్డేపల్లిగారు అనేక మదుర గీతాల్ని రచించడమే గాక సామాజి కంగా నీతిబోధకాలైన మర్యాద రామన్న కథల్ని కూడ మనోహరంగా మలిచారని ప్రశంసించారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహితయైన దాసరి వెంకటరమణ పుస్తకాన్ని సమీక్షిస్తూ "మూఢనమ్మకాలైన "చేతబడి" లాంటి కథల్ని కూడ వడ్డేపల్లిగారు "మర్యాద రామన్న కథల్లో" తనదైన ఆసక్తికర శైలిలో రచించగా "నేషనల్ బుక్ ట్రస్ట్" వారు ముద్రించడం సముచితంగా వుందన్నారు.

ఆత్మీయ అతిథిగా పాల్గొన్న 'నేటినిజం' పత్రికా సంపాదకులైన బైస దేవదాసు మాట్లాడుతూ "మనిషై ప్రవహించాలన్న సినారె కవితలాగా, వడ్డేపల్లిగారు నదిలాగానే ప్రస్తుత సమాజంలో తన రచనలలో ప్రవహిస్తూ ప్రబోధ కథలతో పరిసర సామాజిక క్షేత్రాన్ని సారవంతం చేస్తున్నట్లు అభివర్ణించారు.

"సత్కళాభారతి' పక్షాన రచయిత వడ్డేపల్లి కృష్ణను అతిథులు శాలువా, దండతో సత్కరించి అభినందించారు. తదుపరి డా॥ వడ్డేపల్లి కృష్ణ మాట్లాడుతూ "తన జన్మదినం ప్రతి ఏటా ఒక నూతన గ్రంథానికి జన్మదినం కావాలని, తనకు తోడ్పడిన ప్రతిభా మూర్తుల్ని సత్కరించడం ద్వారా అది పర్వదినంగా మారాలని భావించినట్లు వెల్లడించారు. తొలి ప్రయత్నంగా సంగీత, సాహిత్య వేత్తలైన సీనియర్ ప్రతిభా మూర్తులుగా డా॥ తిరుమల శ్రీనివాసాచార్య, డా॥ ఎం. చిత్తరంజన్‌గార్లను ఉత్తమ అనువాద రచయితగా డా॥ ఎం. లక్ష్మణాచార్యను ఎంచుకొని వడ్డేపల్లి కలహంసి ప్రతిభా పురస్కారాల్ని ఇవ్వదలచినట్లు చెప్పారు. ముఖ్య అతిథిచే వారిని శాలువా, దండ, జ్ఞాపికలనే గాక నగదు సహితంగా పురస్కారాల్ని అందించి, ఘనంగా సత్కరించారు. ఇకపై కూడ ఇలాగే ప్రతియేటా రాజకీయాలకు అతీతంగా తన జన్మదిన సందర్భంగా మిగతా ప్రతిభామూర్తుల్ని కూడ సత్కరించదలచినట్లుగా ప్రకటించారు.



డా॥ తిరుమల శ్రీనివాసాచార్యకు ప్రతిభా పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు.

డా॥ ఎమ్.చిత్తరంజన్‌కు ప్రతిభా పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు.

డా॥ మరిగంటి లక్ష్మణాచార్యకు ప్రతిభా పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు.

అతిథులతో కవులు, కవయిత్రులు రామలక్ష్మి, పెద్దూరి వెంకటదాసు, రఘువీర్‌ప్రతాప్, శిష్టా మాధవి, వసుంధరాదేవి.

మర్యాద రామన్న కథలు పుస్తక రచయిత డా॥ వడ్డేపల్లి కృష్ణను సత్కరిస్తున్న అతిథులు

ప్రతిస్పందనగా లలిత సంగీత ప్రయోక్తయైన డా॥ ఎం. చిత్తరంజన్‌గారు మాట్లాడుతూ "వడ్డేపల్లి కృష్ణ అద్భుతమైన గేయ రచయిత కాబట్టి తనకెంతో ఇష్టుడయ్యాడని, అతని లలిత గీతమైన **"జగతిరథం జైకొడుతూ ప్రగతి పథం"**పై **పోనీ ప్రగతిపథంపైన జగతిపండువెన్నెలై రానీ"**- తన సంగీతం స్వరంలో 1972లో ఈ మానవ పాటగా రేడియోలో మారుమ్రోగిందని 50 ఏళ్ల కిందటి విషయాన్ని వివరిస్తూ పాడి అందర్నీ ఆకర్షించారు. అంతేగాక వడ్డేపల్లిగారి మరో లలితగీతం "మనమంతా ఒక్కంటనే మంచి మనసుతో పెరగాలి- జగమంత ఒక్కటనే మంచి రోజుకై సాగాలి" అనే దాన్ని తన స్వర కల్పనలోనే ''బాలల జాతీయ సామూహిక గానంకై ఢిల్లీ కేంద్రంచే ఎన్నిక కాబడి దేశమంతా 125 స్టేషన్‌ల ద్వారా అన్ని భాషల్లో ప్రసారమై ఇద్దరికీ ఎంతో పేరు తెచ్చినట్లు వివరించారు. ఆ తర్వాత ప్రసిద్ధ సాహితీవేత్త, పురస్కార గ్రహితయైన డా॥ తిరుమల శ్రీనివాసాచార్య మాట్లాడుతూ "కృష్ణ అంటే ఆకర్షించేవాడని నల్లసయ్య అనే అర్థాలున్నట్లే వడ్డేపలికృష్ణ మంచి మనసుతో అందర్నీ ఆకర్షిస్తూ జనరంజకమైన ఎన్నో లలిత గీతాల్నే గాక సినీ గీతాల్ని రచించిన రాణించా డని, ప్రతిభావంతంగా రూపకాల్ని రచించి ప్రపంచఖ్యాతిగాంచాడని, తనతో గల చిరకాల పరిచయాల్ని వివరించారు. ప్రామాణికంగా "లలిత గీతాల"పైమొట్టమొదటి పరిశోధన చేసిన డాక్టరేట్ పట్టా పొందిన ధన్యుడని అభినందించారు. ఆ తర్వాత ఎం. లక్ష్మణాచార్య మాట్లాడుతూ 'అనువాద రచనలో తనతో పాటుగా కూర్చుని కృష్ణగారు తనకు నచ్చేంత వరకు శబ్దభావ సుందరంగా అనువాదం వచ్చేంత వరకు వదలలేదని అందుకే ఆయన "పాటవెలదులు" హిందీలో 'విశ్వదర్పణ్''గా విశిష్టంగా అనువదించగలిగినట్లు వెల్లడించి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రధాన కార్యక్రమానికి ముందుగా శ్రీమతి శిష్టా మాధవిగారి నిర్వహణలో కవి సమ్మేళనం జరుగగా శ్రీయుతులు పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, రఘువీర్ ప్రతాప్, ఆలూరి విల్సన్, డా॥ లలితావాణి, రామలక్ష్మి తదితరులు పాల్గొని కవితా గానం చేశారు. ఆ తర్వాత కవులందర్ని కండువాలతో సత్కరించడం జరిగింది. ప్రధాన కార్యక్రమానికి ముందుగా, కుమారి శిష్టా వసుంధ రాదేవి అన్నమయ్య కీర్తనల్ని శ్రావ్యంగా ఆలపించింది. కార్యక్రమారంభంలో సత్కళాభారతి సత్యనారాయణ అతిథుల్ని వేదికపైకి ఆహ్వానించి, చివరగా వందన సమర్పణ చేయడంతో కార్యక్రమం ముచ్చటగా ముగిసింది.

సంబరాలు

జీవం కోసం
భుజించాలి
జనం కోసం
జీవించాలి.

బాధలు ఎదురైతేనే
యోధులవుతారు
భావితరాలకు
గాథలవుతారు

ఎవరో ఏదో అన్నారని
ఆవేదన చెందకు
అందరినీ ఆనందపర్చటం
అసాధ్యమని మరువకు.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

ప్రగతి పథాన మన భారతం

భరత భూమిలో పరదేశవాసులు
కొల్లగొట్టిరి సంపదలు
అధికారం చేలాయించిరి
ఐకమత్యమే ఆయుధం చేబూని
ధర్మ మెల్ల వేళలో ధరణీ నిలుపగ
సత్యవాక్కు, శాంతి బాటన నడిచి
దేశమంతటను ఒక్క తాటిపై నడిపి
భరత వీరులంతా
మన భూమిని
కంటికి రెప్పవలె కాపాడి
ఆటుపోట్లకు దీటుగా నిలిచి
తరిమికొట్టింది తెల్లవారను
భరత వీరులు సాధించిరి
స్వాతంత్ర్యాన్ని
స్వేచ్ఛా వాయువులను పీలుస్తూ,
అభివృద్ధివైపు అడుగులు వేసిరి
శాస్త్ర సాంకేతికంగా వృద్ధి సాధించి
యుక్కిగ విద్యుత్ శక్తిగా మలచి
ఊరూరా వెలుగుల కాంతులు
విరజిమ్మేను
అవని నుండి అంతరిక్షం వరకు
అల్లుకుపోయిన వైజ్ఞానికపు కాంతులు,
విలువైన సంపదకు నెలవైన
బ్యాంకులను జాతికి అంకితం చేసె,
ఉప్పొంగే తరంగాల జలసిరులు
పాశ్చాత్యుల దృష్టిని సైతం నిలిచె,
ఆడపిల్లలే సాధించిరి...
ఆకాశంలో సగమై
మేము సైతం అంటూ
అంతటా నిలిచారు సాధించిరి
అన్నింటా విజయాలు
మ్రోగించిరి విజయదుందుభిలు,
ఎల్లవేళల ఎల్లలుకాపాడే సైన్యం
సాంకేతికత చేతి కరదీపికలై
శాస్త్రాలన్నీ నీబాసట అస్త్రాలై
యావత్తూ విలువలై, నీవలువలై
ఈ విశాల దేశంలో
నిన్ను నిన్నుగా నిలుపగ
భారతీయుడవై,
సగౌరవంగా జీవించు
ఒకరికి ఒకరై ,అందరిలో ఒకరమై
భారత ఖ్యాతిని
అంతర్జాతీయ పథాన నిలుపుదాం
ఈ డెబ్బైయిధవ స్వతంత్ర
అమృతోత్సవం వేళ
పూనుదాం ప్రతిన....
బంగరు భారతావనికై...

-డా.శ్రీభాష్యం
అనూరాధ
8790325502

మెంటర్స్ & స్పాన్సర్స్ !

కలత పెట్టిన నటనలు
కొలత లేని వంచనలు
కోల్పోయిన సమయాలు
అలుపెరగని సాహసాలు
ఆర్థికపరమైన మోసాలన్నీ
మదిలో కదిలే బాణాలతో
శిలలై మిగిలిన జ్ఞాపకాలతో
మరిచిపోలేని అనుభవాలెన్నో
గుండెనుండి దూరంకాక నేటికీ
శ్వాసతో సహజీవనం చేస్తున్నాయి !

ఎవరెలా నమ్మించారో ?
ఎవరెన్ని నాటకాలేశారో ?
ఎవరెంత నష్టపరిచారో ?
ఎవరెలా కాపు కాసారో ?
ఎవరెంత కసిగా కాటేశారో ?
అమాయకమైన గుండెలో
గునపాలెలా దించారో ?
పరిచయంలేనట్లు కళ్ళెదుటే
తిరిగే మనుషుల కదలికలతో
గుండె కలత పడుతుంటది .
అర్థంకాక సతమతమైన
మనసెపుడైనా భరించేది
పరాకాష్టను పసిగట్టనంత వరకే !
అయినా, కోపాన్ని కర్పూరంలా కాల్చి
ఓపికనింకా నమ్ముతున్నందుకే
ఓడిపోక గెలుస్తూ నిలుస్తున్నాం !

అయినా ,
హూందాగా ఎదుటివారి
కళ్ళలోకి సూటిగా చూస్తూనే ,
అందరిని కళ్ళతో కనిపెట్టుకొని
మనసులో దాచుకొంటున్నాం !
వారిచ్చిన జ్ఞాపకాలను మరువక
ప్రతినిత్యం పద్యంలా పఠిస్తూ
మన విజయ శిఖరాలను తలెత్తి
చూడనంత అత్యున్నత వేదికలపై
వారికందనంత ఎత్తుకెదుగుదాం !

వారి అకృత్యపు స్వరూపాలను ,
అరాచక స్వభావాలను తెలిపి ,
మన నిద్రాణమైన గుణాలను
నైపుణ్యాల్లోని నాణ్యతలను
మెదడులోని పదునును
ఆత్మవిశ్వాసంలోని అదృశ్యశక్తిని
ప్రపంచానికి పరిచయం చేసిన
మహానుభావులందరిని కలకాలం
మన మెంటర్లనుకొని , స్పాన్సర్లనుకొని
పేరుపేరున కృతజ్ఞత తెలుపుదాం !

- డా. డి. రాజేశ్
9440460490

నానీలు

అమ్మ కళ్ళకు
అనురాగ దీపాలు
పసిపాప
బోసినవ్వులు.

ఇంటి వాకిలి
పూల తోటైంది
పాపాయి నవ్వులు
విరబూసి.

ముఖాన నవ్వే
చిట్కా
మనిషి ఆరోగ్యానికి
మనసు ఆహ్లాదానికి.

ప్రకృతి అందానికి
ఓ పూవు చాలు
మన ఆనందానికి
ఓ నవ్వు చాలు.

మమతలు
మొలకలు వేస్తాయి
పెదవులపై
నవ్వులవిత్తులు నాటితే.

- డాక్టర్ చక్రపాణి
యిమ్మిడిశెట్టి
9849331554

సినారె...

అక్షరముల గొప్ప యందముగాదెల్పి
వ్రాసె కావ్యములను వన్నె పెంచ
తెలుగు శోభనంత తెలుపగా జనులకు
అడుగు పెట్టెనతడు యవని యందు.!

జ్ఞానపీఠమొసగె :ఘనమగు తేజము
నేర్చి విద్య పంచె నేర్పు గాను
తెలుగు జాతికంత వెలుగు 'సినారె యె
సహజ కవిగాను సాగె నిలన.!

సుందరమగు రచన :సులభముగా చేసి
మెప్పు గాంచె నిలన మేటి గాను
వినుత కెక్కె నరుడు: విశ్వంభరుడి గాను
తెలుగు భాష కంత :వెలుగు తెచ్చె .!

యుగళ కవులు గాను యుగమునకెక్కిరి
నిలిచె దాశరథియె నిక్కముగను
జంట కవులు గాను జత సినారెతొకల్సి
పలు రచనలు చేసి పరిడవిల్లె

-సునీత బండారు
9440671530

సినారె

అవి మూడక్షరాలే
ముక్కంటి ఫాలభాగం !

అది నిలువెత్తు రాయె
అజంతా ఎల్లోరా చెక్కిన శిల్పం !

ఎదిగిన పూచిన పాదే
ఆయనొక ఎవరెస్టు శిఖరం !

దినదిన ప్రవర్ధమానమైన బతుకే
అదొక గొప్ప పుట్టుక

పొద్దున్నే అంటుకున్న పొయ్యే
ఆయన ఒక రాజుకున్న నిప్పు !

ఆయన రాసివిసిరేసిన అక్షరాలే
సువర్ణాక్షరాల పూలమాలలు !

ఆయన ఉపయోగించిన ప్రాసలు
ఊపిరి పీల్చుకుంటున్న శ్వాసలు !

ఆయన తాగిన ఉగ్గుపాలే
జన్మతా వచ్చిన ఉక్కు కవచం !

ఆయన నోటినుండి వెలువడిన రాగాలే
గలగలపారుతున్న గంగా జలపాతం!

ఆ మందలింపు ఉరుములే
ఎలిగెత్తిన ఉత్తుంగతరంగాలు !

చేతితో ఆడించిన బరిగెనే
గురిపెట్టిన బాణం !

ఆ మనసెత్తు ప్రోత్సాహమే
ఒక నిలువెత్తు గ్రంథాలయం !

ఆ సాహిత్యప్రక్రియల గ్రంథకర్త
అదొక విరగకాసిన పంటపొలం !

మనసారా అందించిన ఆ దీవెన
జ్వాజ్వల్యమాన రక్తస్పర్శ జ్వలన !!

- కందుకూరి
శ్రీరాములు
సెల్:9440119245

పుస్తక సమీక్ష

శ్రమజీవుల జీవన విధానం, మానసిక సంఘర్షణకు దర్పణం "మేడిపండు"

సమాజాన్ని అక్షరంతో నిగ్గదీసిన కవి అంతర్మధనం "మేడిపండు" కథల సంకలనం.

డైబ్బై ఐదు వసంతాల స్వాతంత్ర్య భారతావనిలో అభివృద్ధికి నోచుకోని మారుమూల ప్రాంతాల్లోని పేదల కష్టాల ముఖచిత్రం.

ఓట్లు అడుక్కుంటూ వీధి వీధి తిరిగినోడు, నేడు కోట్ల ధనం దండుకుంటుండు.తరతరాలకు తరగని సంపద వెనకేసుకుంటుండు.

ఓటు వేసిన సామాన్యుడు,తన నుదుటి రాతను నిందించుకుంటూ వెట్టిచాకిరీ చేస్తూ మగ్గిపోతుంటుండు..,దవాఖానాల చుట్టూ తిరుగుతుండు. దీనికి కారణమేమిటని?బాధ్యులెవ్వరని?. సమాధానం కోసం సంధించిన అక్షరాలు.

ఆర్థిక అసమానతలను చూస్తూనే, చెమర్చిన కన్నులు తూడ్చుకుంటూ...రేపటి వెలుగులు కోసం నిరీక్షిస్తూ... కాలం గడుపుదామా?

అనే ప్రశ్న ప్రతి పాఠకుని ఎదను సూటిగా,తాకేలా రచనలను సంధించిన "కథల సంకలనం మేడిపండు".

"ఎదను తడిమేస్తున్న కథనాలు" శ్రమజీవుల ధీనగాథలు , సమాజంలోని వాస్తవిక సంఘటనలను కథలుగా మలచి,అందించగల బహునేర్పరి అన్న రాచమళ్ళ ఉపేందర్ గారు.

అనేక సాహిత్య సంస్థలు నిర్వహించిన కథల పోటీల్లో ఉత్తమ కథలు విభాగంలో ఎన్నో పురస్కారాలను అందుకుంటూ, "అక్షరాల తోవ" అనే సాహిత్య వేదిక సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహిస్తూనే, వర్ధమాన కవులను ప్రోత్సాహిస్తూ, తనలోని భావాలను నలుగురితో పంచుకునే, కవి ,కథా రచయిత, వ్యాసకర్త.

ఇలా అనేకానేక రంగాల్లోనూ, రాణిస్తున్న రాచమళ్ళ ఉపేందర్‌గారి మస్తిష్క మథనం నుండి పురుడు పోసుకున్న కథల సంకలనం "మేడిపండు."

మేడిపండులా కనిపించే సమాజంలో అంతరంగా దాగిన అనేక సమస్యలను తనదైన శైలిలో,కవి కోణంతో చాలా దగ్గరిగా , నిశితంగా పరిశీలిస్తూ, అక్షరీకరించి, సగటు సామాన్యుని జీవన విధానం, కన్నులకు కట్టినట్లుగా వివరిస్తూ మనకు అందించిన కథల అక్షయ పాత్ర

ఈ "మేడిపండు కథల "సంకలనం.

ఒక కథ చదివిన తరువాత ,ఆ కథలోని పాత్రలు మనతో కొన్ని రోజులు ప్రయాణించాలి,

అటువంటి కథలను పాత్రలను సృష్టించి, సమాజంలోని వాస్తవ సంఘటనలో వాటిని ప్రతిష్టించిన కథల మణిహారమే మేడిపండు .

కథ యొక్క లక్షణాలు మనం పరిశీలించినట్లయితే,కథకు ప్రారంభం ఎంత ముఖ్యమో ముగింపుకు అంతకంటే ప్రాముఖ్యత ఉంటుంది.

రెండింటినీ సమన్వయ పరిచే మధ్యస్థం పాఠకుల్ని కథనం వైపుకు పరుగులు పెట్టించాలి.

ఊహకందని ముగింపుతో, కథ ముగింపు కోరుకుంటాడు పాఠకుడు.

ఈ విషయంను దృష్టిలో పెట్టుకొని సంకలనంలో చాలా వైవిధ్యమైన, ఇతివృత్తాలను ఎన్నుకుని కథా రచయిత గా తనని తాను నిరూపించుకున్నారు.

ఇక్కడ మనం వేమన పద్యం గుర్తు చేసుకుందాం.

మేడిపండు చూడ మేలిమైయుండు
పొట్టవిప్పి చూడ పురుగులుండు... ఈ వేమన పద్యం మీకు తెలిసిందే.

కానీ ఈ మేడిపండు సంకలనం



మొదటి పేజీ నుండి చివరి పేజీ వరకు మధ్యతరగతికి చెందిన మనిషి జీవన విధానం, తను ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని పరిష్కరించడానికి సహకరించే కుటుంబ బంధాలు...ఇలా చెప్పుకోవడానికి ఎన్నో..మనకు కనిపిస్తూ పలకరిస్తుంటాయ్.

కన్నీటి ప్రవాహం కథ చదువుతుంటే నాకు సిరివెన్నెల సీతారామశాస్త్రి గారి ''అర్ధశతాబ్దపు అజ్ఞానాన్ని స్వాతంత్రమందామా,!దానికి స్వర్ణోత్సవాలు చేద్దామా"అనే పాట గుర్తుకు వస్తుంది.

ఎన్ని పంచవర్ష ప్రణాళికలు వేసినా ! మారని పేదవాని జీవన విధానం చూస్తుంటే ,మనం సాధించిన ప్రగతి ఎక్కడ అనే ప్రశ్న ప్రతి క్షణం వెంటాడుతూనే ఉంది. వేదికపై రాజకీయ నాయకులు చెప్పే మాటే మనం అభివృద్ధి పదంలో దూసుకు పోతున్నాం అని.

కానీ ఇలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు మనం అభివృద్ధి సాధించాము అని చెప్పుకునే ధైర్యం కానీ తెగువ కానీ నిజాయితీ కానీ మనలో ఉందా?.

అలా ఉంటే ఇంకా మారుమూల ప్రాంతాల్లో రవాణా వైద్య విద్యా సౌకర్యాలు లేకుండా బ్రతుకుతున్న అనేక జీవితాలకు వెలుగు ఎందుకు అందడం లేదు అని ప్రశ్నిస్తే , మనం సమాధానం తడుముకోవలసిన పరిస్థితి నెలకొంది నేడు.

"కన్నీటి ప్రవాహం"కథ ఒక వాస్తవిక సంఘటనే .

ఇప్పటికీ మారుమూల ప్రాంతాల్లో, ఏజెన్సీ ఏరియాల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉంటాయి.

మన సోషల్ మీడియాలో ,టీ వీ డిబెట్ లో వినిపిస్తూనే ఉంటాయి.

ఒకటి రెండు రోజులు చర్చ జరుగుతూనే ఉంటుంది. తర్వాత వాస్తవ సంఘటనలు కాలగర్భంలో కలిసిపోతుంటాయి .

కానీ సంఘటనకు మూలమైన ప్రాంతంలోని ప్రజల జీవన విధానంలో మాత్రం ఏటువంటి మార్పు రాదు.

మార్పు రాకపోవడానికి కారణం ఎవ్వరు?.

అందులో నా పాత్ర ఎంత? మార్పు తీసుకు రాలేకపోతున్న నేటి వ్యవస్థలోని యంత్రాంగం చేత పని చేయించుకోలేని మన నిస్సహాయతను కాదనగలమా?.

ఇలా వెంటాడే ప్రశ్నలకు సమాధానం మనం తప్పక వెతకాలి అనిపిస్తుంది.

"నాన్నా ...!మన ఇంటికెల్దామా?"అనే కథ గురించి ఇక్కడ చర్చించక తప్పదు.

యావత్ ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన మహమ్మారి కరోనా.

దాని ప్రభావంతో ఎన్ని లక్షల కుటుంబాలు బలైపోయాయో?, ఎందరు నిర్భాగ్యులు ఆత్మహత్యలను చేసుకున్నారో,?

ఎన్ని వేల మృతదేహాలకు కనీస దహన సంస్కారాలు నోచుకోలేదో,? నేటికీ లెక్కతేలలేదు.

అంతటి విపత్కర పరిస్థితుల్లో జీవనాధారం కోసం వలస వెళ్ళిన కాన్షీరాం కుటుంబం ,సొంతగూటిని చెరలేక, పొరుగు రాష్ట్రాల్లో ఉండపోలేక, జీవన్మరణ పోరాటంలో తన కన్న కూతుర్ని కోల్పోయిన విధానం ప్రతి పాఠకుని హృదయాన్ని ద్రవింపచేసేలా సాగుతుంది.

ముగింపును విషాదభరింగా ముగించినా.చివరగా సంధించిన ప్రశ్న . ప్రతి ఒక్కరు ఆత్మ పరిశీలన చేసుకోవాలి అనేంతగా ఎదను తాకుతుంది.

"పసి ప్రాణం తీసిందెవ్వరు...???

ప్రతి ఒక్కరూ సమాధానం చెప్పకప్పదు...

ఈ పాపంలో తమ పాత్ర లేదని చెప్పగల యోగ్యుడు ఎవ్వరు?....సమాధానం మనకే వదిలేసాడు రచయిత.

కొన్ని రోజులు వరకు ఈ ప్రశ్న మనల్ని వెంటాడుతూనే ఉంటుంది..అదే కథ గొప్పతనం.

మరో కథ "మేడిపండు"

సంకలనం ఆయువుపట్టు ఈ కథనమే.

సమాజంలో దోపిడి వర్గాన్ని కొమ్ముకాసే ప్రభుత్వ, పాలక వర్గాలు, వ్యవస్థను ఎలా భ్రష్టు పుట్టిస్తుంది తెలిపిన కథ.

దోచేవాడు ఒకడు, దండన భరించే వాడు మరొకడు.

సామాన్యుని చెంతకు చేరని చట్టాలు, ఉన్నవాడికి ఊడిగం చేస్తూ, సామాన్యుని నడ్డి విరిచేస్తున్నాయ్.

నేటి పాలక వర్గానికి నిదర్శనం ఈ కథనం.

సామాన్యునికి న్యాయం జరిగేది ఎన్నడో ?అనే ప్రశ్నకు బీజం ఈ కథ.

ఉన్నత కుటుంబాల ఇల్లలో జరిగే దారుణాలకు , జీవనాధారం కోసం కూలి పని చేసుకునే అమాయకులు ఎలా బలి అవుతారో వివరించిన కథనం.

"శివంగి" వ్యవస్థలో మార్పు రాదు, మార్పు తీసుకువచ్చే ప్రయత్నం మనతోనే మొదలవ్వాలనే సందేశాన్ని, నిలుపుకున్న కథ .

నిరక్షరాస్యతను అడ్డుపెట్టుకుని, ధనవంతులు , సామాన్యున్ని దోచుకోవాలని చూసే ఇతివృత్తంగా తీసుకుని వ్రాసిన అద్భుతమైన కథనం శివంగి.

భర్తను, కన్న కొడుకును కోల్పోయి, జీవనాధారం కోసం చిన్న హోటల్ పెట్టుకు జీవించే చుక్కమ్మ.

తన స్థలాన్ని మోసంతో ఆక్రమించుకోవాలని చూసే భూస్వాములపై తిరుగుబాటు చేసి తన జీవనాధారం దక్కించుకున్న విధానం ఎందరికో ఆదర్శంగా నిలుస్తుంది.

వ్యవస్థలో మార్పు రాదు, మార్పు తీసుకువచ్చే ప్రయత్నం మనతోనే మొదలవ్వాలనే సందేశాన్ని నింపుకున్న కథ శివంగి.

చుక్కమ్మతో మొదలైన తిరుగుబాటు మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపే దిశగా సాగుతుంది..

మరో అద్భుతమైన కథ "తోవ" మానవత్వ పరిమళాల పూదోట,ఈ "తోవ" కథ.

కథ ప్రారంభం, ఎదుటి వ్యక్తిపై అనుమానంతో మొదలై ప్రతిక్షణం అనుమానంగా చూస్తూ సాగుతూ ఉంటుంది

ఎప్పుడూ కనిపించిన వ్యక్తి కనిపించడంతో , అనుమానం మొదలౌతుంది.

పగలు కనిపించడు.రాత్రిమాత్రమే ఎందుకు కనిపిస్తున్నాడు.

అసలు రాత్రి వేళ అతనికి ఇక్కడేం పని.

అనే అనుమానం ఎన్నో ప్రశ్నలు రేకెత్తిస్తుంది.

ఎదుటి వ్యక్తి గురించి తెలుసుకోవాలనే జిజ్ఞాస కలిగిస్తుంది.

అనుమానాలు తొలగి మానవత్వం వికశిస్తుంది.

ఎదుటి వ్యక్తికి మనం ఏం చేయగలం అనే ఆలోచన మొదలై, ఒక కుంటుంబానికి ఆసరాగా నిలిచేలా చేసిన మానవ సంబంధాలను కరుణరసాత్మకంగా తీర్చి దిద్దిన కథనం.

ఇలా ఎన్నో అద్భుతమైన కథలను తనలో నిలుపుకున్న ,మేడిపండు.

సామాన్యుని జీవన విధానానికి దర్పణం.

సమాజాన్ని అధ్యయనం చేసిన కవి, సమాజంలో తన బాధ్యతను గుర్తించిన కవి.

కష్టాలను ఎదుర్కొని,,ఎదుటి వారి కష్టాలను అర్థం చేసుకుని,మానవతా విలువలు శోధించిన కవి,

కలం నుండి జాలువారిన శ్రమజీవుల జీవన విధానం,మానసిక సంఘర్షణకు దర్పణం..

అందరూ తప్పక చదవవలసిన కథల సంకలనం "మేడిపండు."

ప్రతులకు: రాచమళ్ళ ఉపేందర్,ఖమ్మం.
వెల: 100/-
సెల్. 9849277968.

-రాము కోలా
సెల్.9849001201

ఏరువాక సొగసు

మొయిలు మాటునుండి
జాలువారు చిరుజల్లులు
కంకులనుండి రాలిపడే
ధాన్యపు రాశులుగా
గాదెలునిండాలని కోరుతూ
ఎండనక వాననక
కడుపు కట్టుకుని
ఆరుగాలం శ్రమిస్తూ
ఆలి తాళి కుదువబెట్టి
అప్పులు తనకు తప్పవని
కష్టాలు కొత్తకాదని
పంచభూతాలు తనకు
బంధువులేనంటూ
తనక్షేమం కోసం కాక
జనక్షేమాన్ని కాంక్షిస్తూ
భూమాతకు జోతలర్పిస్తూ
వరుణదేవుని ఆహ్వానిస్తూ
షోడశకళాపూర్ణుడు
కురిపించే అమృతధారలే
తమకు జీవనాధారమని
తొలకరి జల్లులలో విత్తి
చేయి చేయి కలిపి
ఏరువాక సాగించి
మానవకోటి ఆకలినిదీర్చే
అన్నదాత రైతన్నకు
చేద్దాం పాదాభివందనం..

-డా.మైలవరపు
లలితకుమారి
9959510422

దీర్ఘాయుష్మానుభవ!

నూరు అనేది ఓ సంఖ్యనే కావచ్చు? కానీ అది మొట్టమొదటి మూడంకెల సంఖ్య. దానికి అంకెల్లో మొదటిదైన 'ఒకటికి' ఉన్నదానికన్నా ఎక్కువ ప్రాముఖ్యత. అందుకే ఆయుష్షులోనైనా, ఆటలోనైనా ఆ సంఖ్యకెప్పుడూ అంత ప్రాముఖ్యత. పూర్వం బహుమతికి నూరు వరహాలు అనేవారు. ప్రతి శుభ సందర్భంలో 'నిండు నూరేళ్లు జీవించు!' అని ఆశీర్వదించేవారు. నాడు, నేడు, మరి రేపటికి కూడా నూరు అనే సంఖ్య ఒక ప్రత్యేకమైన మైలురాయి కింద లెక్క! దాన్ని చేరుకోవడానికైనా, దాటడానికైనా ప్రత్యేక శ్రద్ధ, కృషి అవసరం! కొన్ని రంగాల్లో కించిత్ అదృష్టం కూడా కలిసి రావాలంటారు.

విజ్ఞాన శాస్త్రం ప్రకారం మనిషి ఎక్కువ కాలం జీవించడానికి అన్నింటికన్నా తాను తినే తిండి, దినదిన వ్యాయామం (చేసే పని) మరియు పుట్టుకతో ప్రాప్తించిన జీవ కణం (జీన్) మున్నగు వాటి పాత్ర చాలా ప్రధానమైనది. ఆహారం విషయంలో ఆరోగ్యానికి ఏదైతే మంచిదో అదే తినాల్సిన అవసరం లేదని, నచ్చిన దాన్ని కూడా ఓ మోతాదులో తినడం శ్రేయస్కరమని ఎందరో శతాధిక వృద్ధులు తమ అభిప్రాయం వెలిబుచ్చారు. ఎవరి విషయంలోనైనా పుట్టి పెరిగిన స్థలాన్ని బట్టి ఆహార నియమాలు సర్వసాధారణం.

జపాను దేశంలోని ఒకినావా మరియు దాని చుట్టుపక్కల ప్రాంతంలో నివసించే ప్రజల్లో ఇప్పటిదాకా దాదాపు యాభై వేల పైననే శతాధిక వయస్కులు జీవించి వున్నట్లు రికార్డ్! అన్ని దేశాల్లోకెల్లా ఇది ప్రపంచంలో నూరేళ్లు పైబడి బ్రతికిన వారి అత్యధిక సంఖ్య. జపానులోని స్థితిగతులు మరియు అచట జనాల జీవనశైలి ఇందుకు ముఖ్య హేతువు కావచ్చు. వారి పని గంటలు కూడా చాలా ఎక్కువని వినికిడి.

చాలా ఏళ్ళు బ్రతకాలని అందరికీ ఉంటుంది. కానీ చివరిదాకా ఆరోగ్యంగా ఉండాలంటే ఎందరికి సాధ్యం! మానవ దేహ నిర్మాణంలో ఉన్నంత సంక్లిష్టత బహుశ ఈ ప్రకృతిలో ఏ జీవికి ఉండకపోవచ్చు. ఆయుర్దాయం నిశ్చయించే ముఖ్యమైన అవయవాలు అగుపడకుండా దేహంలో ఎన్నో ఉన్నాయి. అవి ఎంత కాలం ఆరోగ్యంగా ఉంటే అంత ఆయుష్షు! వార్ధక్యం అనేది అందరికీ సిద్ధించేదే! శరీర భాగాలన్నింటిలో చర్మం చాలా పెద్దది. పెరుగుతున్న వయసుకు, వృద్ధాప్యపు మొదటి సూచికలు అగుపించేదీ ఆ చర్మం మీదనే. 'స్టేయింగ్ యంగ్ మీన్స్ స్టేయింగ్ ఫిట్!'... ఇదే అందరికీ వర్తించే మూల సూత్రం. పనే ప్రాణవాయువని ఏనాడో సెలవిచ్చారు పెద్దలు! తగినంత పనిలో నిమగ్నమవుతూనే శారీరక వ్యాయామంతో, ఉల్లాసమైన వ్యక్తిగత స్వభావంతో, మానసిక ప్రశాంతతే ధ్యేయంగా గడిపే వారికి ఇది సాధ్యమని ఋజువులు ఉన్నాయి. యువర్ పర్సనాలిటీ అఫెక్ట్స్ యువర్ లాంగేవిటీ! ఆటిట్యూడ్ డిటర్మిన్స్ పీస్ ఆఫ్ మైండ్! ఎవరితోనూ కలువకా ఎవరికి వారే ఒంటరిగా వుండడం పెద్ద శాపం... ఆయుష్కు అరిష్టం! అంతకంటే మించిన దరిద్రపు బ్రతుకు ఉండదు. పదిమందితో కలవడం, సమాజంతో మమేకమవడం, స్నేహంగా మెదలడం ఆయుష్కుకు శుభాశీస్సులు!

ముక్కుతూ మూలుగుతూ, పడుతూ లేస్తూ, నేలపై దేకుతూ, కుంటుతూ ముక్కాలి మీద నడకతో నూరేళ్ల జీవితం ఎవరు కోరుకుంటారు. పైలాపచ్చీసులా, హమేషా హుషారుగా నూరేళ్లదాకానో ఆ పైననో వెళ్ళడం ఎవరికైనా కష్టమే గానీ, వీలైనంతలో ఆరోగ్యంగా ఉండాలనే అందరూ కోరుకుంటారు. మరి.. కోరుకునే వారికి కోటి మార్గాలన్నట్లు, చేతులు కాలే దాకా ఆకుల కొరకు వెదకక కొన్ని దినదిన జీవన ప్రమాణాల్లో పాటించగలిగే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం అవసరం. అనుకోగానే అన్నీ సమకూరక పోవచ్చు. అందుకే మన లక్ష్య సాధనకు కొన్ని నిర్దేశిత దీర్ఘకాలిక ప్రణాళికలు ఉండాలి. సాధ్యమైతే.. మంచిది!

> ఎంత చనువున్నా ఎవరైనా తన స్నేహితుడి వ్యక్తిగత పరిధిలోకి దాటి వెళ్ళకూడదు. ఇది ప్రతి స్నేహితుడికి వర్తించే వేద మంత్రం.

కలుషితానికి ఎంత దూరంలో ఉంటే అంత శ్రేష్ఠం! అది పీల్చుకునే గాలి కావచ్చు, తాగే నీరు కావచ్చు, తినే తిండి కావచ్చు... వాసన, శబ్దం, రుచి, చూపు, స్పర్శ... పంచేంద్రియాలకు సంబంధించిన ప్రక్షాళన ప్రణాళిక ఏదైనా కావచ్చు... ఆరోగ్యవంతమైన ఆయువుకు దోహదం చేస్తాయనడంలో సందేహం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే... సహజ ప్రకృతికి దగ్గరగా వెళ్లగలిగినప్పుడే ఇదంతా సాధ్యం. నవ్య నాగరికత ముసుగులో నేటి ఆధునికత రోజు రోజుకు వెర్రితలలు వేస్తుంది. మనిషి తన సగటు ఆయుష్షును అధునాతన వైద్య సౌకర్యాలు ఉపయోగించి పెంచగలిగాడేమో గానీ సంపూర్ణ ఆరోగ్యానికి భరోసా ఇవ్వలేక పోతున్నాడు. ఊహించలేని అనారోగ్య సమస్యలతో బ్రతుకు బండిని లాగుతున్నాడు. పుటుక్కున వచ్చే చావు మేలంటారు కదా, మరి వందేళ్లపైన అనారోగ్యంగా జీవిస్తూ అనవసర బాధలు అనుభవించాలా? ఇలాంటి స్ట్రెచ్చర్ మీద స్ట్రెచ్డ్ బ్రతుకు ఎందుకు?

'ఐక్యూ' ఎక్కువగా ఉండే వాళ్లకు ఆయుర్దాయం ఎక్కువే అని చెబుతున్నాయి పరిశోధనలు. ఐక్యూతో ఎక్కువ ప్రతిభ కనబర్చిన వాళ్ళు అన్ని రంగాల్లోనూ మంచి విజయం చేకూర్చుకోగల్గుతారు. ఆర్థికంగా, సామాజికంగా మంచి స్థాయికి చేరుకునే అవకాశాలు మెండు... కనుక వారిలో ఒత్తిడి, ఆందోళన వంటివి తక్కువ స్థాయిలో ఉండి ప్రాణాంతకమైన జబ్బుల బారిన పడే అవకాశం తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. అయినా ఇదొక్కటే దీర్ఘాయుష్కుకు కారణం కాకపోవచ్చు.

ఆరోగ్యం, ఆయుర్దాయం.. ఈ రెంటికి బలమైన లింకు ఉంది. అలాగే స్నేహంతోనూ ఆరోగ్యం.. ఒక దానితో ఇంకొకటి పరోక్షంగా ముడిపడి ఉన్నాయి. గొప్ప స్నేహితులు ఎంతమంది ఉంటే అంత భేషుగ్గా ఆరోగ్యం. అందుకే అంటారు... 'శత్రువు ఒక్కడైనా ఎక్కువే, స్నేహితులు వంద మందైనా తక్కువే!' అని. స్నేహితులు ఎక్కువగా వున్న వ్యక్తుల్లో ఒత్తిడి, ఆందోళన తక్కువగా ఉండి సాధారణమైన ఆరోగ్య సమస్యలే రావచ్చు. స్నేహితులసలే లేనివాళ్లలో సామాన్యంగా రక్తపోటు, షుగర్, గుండె సంబంధిత సమస్యలు ఎక్కువని పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. కుటుంబ సభ్యులతోనే కాదు, జీవిత భాగస్వామితోనే పంచుకోలేని కొన్ని విషయాలు స్నేహితులతో మనసు విప్పి చెప్పుకునే అవకాశాలు ఎక్కువ. దానితో టెన్షన్ నుంచి చాలావరకు విముక్తి పొందుతారని, అదే వారి ఆరోగ్యానికి మూలమని గుర్తించారు. అయితే.. స్నేహానికి వయో, లింగ భేదంతో సంబంధం లేదు. కాలానుగుణంగా, దాదాపు ప్రతి వ్యక్తీ కుటుంబ వ్యవహారాల్లో నిమగ్నమై రాను రాను వయసు పైనబడిన కొద్దీ సహజంగానే ఆరోగ్యం సన్నగిల్లే సమయంలోనే అనుకోకుండా స్నేహితులు కూడా తక్కువౌ తారు. ఇది చాలా ప్రమాదకరం కావచ్చు. అందుకే ప్రతి మనిషి తన దీర్ఘకాల జీవిత ప్రయాణాన్ని ఇంకా సుదీర్ఘం గా ఆరోగ్యంగా పొడగించాలనుకుంటే, సంఖ్యాపరంగా వారసులతోపాటు ధన సంపాదననే గాక, స్నేహ సంపత్తును కూడా ఘనంగా పెంచుకోగల్గితే అంతే దీర్ఘంగా ఆయురారోగ్యాలుంటాయి!

గొప్ప స్నేహం ఎప్పుడూ ఉన్నతంగానే ఉంటుంది. పురాణాల్లో చెప్పబడిన 'శ్రీకృష్ణ-కుచేల' మరియు 'శ్రీరామ-సుగ్రీవు'ల మధ్య వున్న స్నేహమే మానవజాతికి ఆదర్శం! బంధం ఏదైనా అపార్థాలు సహజం! ఇద్దరి వ్యక్తుల మధ్య స్నేహం దానికి అతీతం కాదు. విడిపోవడానికి చిన్న కారణం చాలు. ఎంతటి గాఢ స్నేహితులకైనా అభిప్రాయభేదాలు, మనస్పర్థలు మామూలే. ఎంత చనువున్నా ఎవరైనా తన స్నేహితుడి వ్యక్తిగత పరిధిలోకి దాటి వెళ్ళకూడదు. ఇది ప్రతి స్నేహితుడికి వర్తించే వేద మంత్రం. వాదన ముదిరి సమస్య జటిలం కాక ముందే ఏ ఒక్కరో కాస్త సర్దుకుపోయి స్నేహానికి గండి కొట్టకుండా చూసుకోవాలి. 'కనెక్ట్ మోర్ ఫర్ స్ట్రెస్లెస్ లైఫ్ అండ్ లివ్ లాంగర్!' అనే దృష్టితో ముందుకు సాగాలి.

తుమ్ముకు, దగ్గుకు, ఏ చిన్నపాటి జబ్బుకైనా ఈ రోజుల్లో దాదాపు అందరి నడక కార్పోరెట్ ఆసుపత్రుల వైపే. అవసరమున్నా, లేకున్నా ఎన్నో డయాగ్నాస్టిక్ టెస్టులు... ఆ తదుపరి వైద్యానికి బోలెడంత ఖర్చు. ఏ శతాధిక వృద్ధున్ని పలకరించినా సారాంశంగా వారు చెప్పేది.. వ్యక్తిగతంగా ఉన్న మామూలు అలవాట్లు తప్ప ప్రత్యేకంగా వేరే ఏ బ్రహ్మ రహస్యాలు లేవని. శరీరం సహకరించినదాన్ని బట్టి వీలైనంత చురుకుగా రోజుకు 8-10 గంటలు శ్రమించడం, ఏ పనైనా వృత్తిలా స్వీకరించి తమకు తామే ఎవరి తోడు లేకుండా చేసుకోవడం. ప్రత్యేకమైన ఆహార నియమాలేవీ లేవు గానీ తమకు ఇష్టమైనవన్నింటినీ తృప్తిగా తినడం, వ్యాయామమంటూ ఏమీ లేదు గానీ కాలి నడకనా రోజూ రెండు మైళ్లు తప్పకుండా వెళ్లడం, స్వచ్ఛమైన ప్రకృతి వాతావరణంలో కాలక్షేపానికి వయోభేదం లేని మిత్రులతో కబుర్లు చెబుతూ గడపడం, శుచి, శుభ్రత పాటించడం. స్వయంకృషి వారి నియమం. ఇవే వారి జీవనశైలి ప్రమాణాల రహస్యాలు!

వయసు పెరుగుతుందనే ఆందోళన వద్దు. అరవై దాటాయి.. వయసు మీదబడుతోంది, ఇక కాళ్లూ చేతులు ఆడించే శక్తి తగ్గిపోతుంది అనే అపోహలో చాలామంది ఉంటారు. పొరపాటు... మానసిక స్థైర్యాన్ని కోల్పోవడమే సగం అనర్థం!

ఆ విషయాన్ని పూర్తిగా మరచిపోయి, అలాంటి ఒత్తిడి దూరం చేసుకున్న వారికి ఆరోగ్యంతో పాటు ఆయుష్షు మరింత పెరిగే అవకాశముంది. ఇందులో బృహత్తర రహస్యమేమీ లేదు. ఆరోగ్యం, స్థిమితం శరీరానికే కాదు మనసుకు కూడా అత్యవసరం. థింకింగ్ ప్రాసెస్ ట్యూన్స్ అండ్ కంట్రోల్స్ హెల్త్ స్టేటస్! ఏ వయసులోనైనా మన శక్తికి తగ్గ పనులు చేయడం ఎప్పుడూ మానేయ వద్దు. ఫీలింగ్ యంగ్ షుడ్ బి ద ఆటిట్యూడ్!

చివరగా మరో విషయం కూడా చెప్పుకోవాలి. 'ఏజ్ ఈజ్ నో బార్ ఫర్ అచీవింగ్ ఎనీ థింగ్!'... అనే ఈ అద్భుతమైన సామెతకు అనుగుణంగా చరిత్రలో ఎన్నో వృత్తాంతాలున్నాయి. ఏదైనా సాధించాలని మనసుండాలే గానీ... వయసు అడ్డంకీ కానే కాదు అని నిరూపించింది 91 ఏళ్ల పైబడిన థాయిలాండ్ కి చెందిన ఓ బామ్మ! కష్టపడి చదవమని పెద్దలు చెబితే, కాలేజీలు ఎగ్గొట్టి పరీక్షలు ఫెయిల్ అయ్యే యువత కోకొల్లలు ఈ రోజుల్లో. కానీ పట్టుదల ఉంటే ఏ పరీక్షలోనైనా నెగ్గొచ్చని రుజువు చేస్తూ ఈ బామ్మ డిగ్రీ పట్టా పుచ్చుకుంది. చదువులో తన గమ్యం మీద ఆసక్తితో ఆ వయసుతో పాటు మామూలుగా వచ్చే 'ఆల్జీమర్స్' బాధను కూడా అధిగమించింది.. తన కలను పట్టుదలతో నెరవేర్చుకుంది.

విచక్షణ భరిత ప్రయత్నం మనది, పరిష్కారం దిశలో పర్యవసానాన్ని విధికి వదిలేద్దాం! 'విధి బలీయం' అంటే గాలిలో దీపం పెట్టడం కాదు.

-ఆచార్య కడారు వీరారెడ్డి,
9392447007

జీవించటం

గలగలా కాసిన్ని నవ్వుల్ని ఒంపి
పువ్వుల్ని పరచే నదిలా పలకరించటం.

వెన్నెల్ని దూసి గోరింటాకులా చుట్టేసుకోవటం
ఎర్రెర్రని మందారం లా వికసించటం .

ఇక్కడ కొలతలు కొలమానాలు లేవు
నిర్మలమైన ఏరులా ఒలికిపోవటం తప్ప.

జీవితమంటే జీవించటం
బాధ్యతగానో ఆనంద పరిమళంగానో
మలచు కోవటం మసలు కోవటం .

జీవితాన్ని ఆస్వాదించటం
వికాసం తో వెలగటం
వెన్నెల పూసినట్లుంటుంది .

నీచుట్టూ ప్రపంచం
నీలో ప్రపంచం
కాస్త దగ్గరగా చూడు
ఆశల మొక్కలు పచ్చ గా ఊగుతుంటాయి.

గాలి లోగిలి లో ఈదటం
ధ్యాన శిఖరాల్ని అధిరోహించటం

కీచురాళ్ళ మధ్య
చీకటి మాట్లాడే వేళ
మబ్బులు తొంగి చూసేవేళ
నక్షత్రాలు నవ్వుతున్నవేళ
డాబా మీద దృశ్యాల్ని మోసుకుంటూ
జీవించటం
తన్మయంగా పవళించటం
ఇది చాలు
ఒక జీవనోత్సవమేదో
నాలో జరుగుతోంది .



-గవిడి శ్రీనివాస్
7019278368, 9966550601

మహానగర నరకాలు

భాగ్యనగర పబ్‌లు కావవి..
పశుత్వానికే ఉత్ప్రేరకాలు
నేరాలకు నిండు నెలవులు
విచ్చలవిడి బరితెగింపులు
అరాచకాలకే పరాకాష్టలు
అనాగరికతకు చిరునామాలు !

మైకంతో ఊగి తూగే ఊయల్లు
నరకరూప నవ స్నేహబంధాలు
డబ్బు మదం తలకెక్కిన కోతులు
మాదకద్రవ్యాల నిత్య తావులు
మత్తుల గమ్మత్తుల నిషాలో..
అత్యాచార వికృత చేష్టలు !

బార్ల ముసుగులో పబ్‌లు
హోరెత్తించే వాయిద్య మోతలు
అశ్లీల స్పర్శ నృత్య భంగిమలు
మత్తును రెచ్చగొట్టే చిమ్మ చీకట్లు
విచక్షణ కోల్పోతున్న యువ తీరులు
మద్యం, మత్తు బానిస కేంద్రాలు !

విందులు వినోదాల మాటున..
విశృంఖ నరాల బలహీనతలు
బడాబాబుల వంకర బుద్ధి బిడ్డలు
నీచాతినీచ అకృత్యాల ఘటనలు
కండకావరమెక్కిన మృగాళ్లు
చట్టాలే చుట్టాలైన అకాలాలు !

పబ్ కల్చర్‌కు చరమగీతం పాడి..
యువతరాన్ని నవతరం వైపు నడిపి..
మత్తు మద్యాలకు మంగళం పాడి..
మానవత్వం వైపు మనసును నడిపి..
అమ్మాయిలో ఆదిశక్తిని చూపించి..
మహాశక్తి మాతలకు ప్రణమిల్లుదాం !

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

కవితాదర్పణం

కవిత
ఒక దర్పణం
దొరుకుట
ఒక అదృష్టం.

కవితలో
కవిగారు కనబడతారు
కమ్మని విషయాలను
కనులముందు పెడతారు,

కవితలో
కవిమోమును చూడవచ్చు
కవిరూపాన్ని
కుంచెపట్టి గీయవచ్చు

కవితలో
కవిమనసునుకాంచవచ్చు
కవిహృదయాన్ని
కనుగొనవచ్చు.

కవితలో
అందాలనుచూడవచ్చు
ఆనందాన్ని
పొందవచ్చు

కవిత
కవ్విస్తుంది
కళ్ళలో
కాపురంపెడుతుంది.

మంచికవిత
మనసులో నిలుస్తుంది
సుకవిత
చిరకాలం చిత్తాన్నితొలుస్తుంది

కవితాదర్పణాన్ని
అందుకోండి
కవిగారిమనోభావాలను
వీక్షించండి

-గుండ్లపల్లి
రాజేంద్రప్రసాద్,
9177915285

రాలిన ఆయువు పత్రాలు..

ప్రశాంత మానససరోవరంలో
భావదారిద్ర్యం వల్ల ఓ అలజడి
గాడితప్పిన క్రమశిక్షణతో
సున్నితహృదయాల్లో తడి.
యౌవన వక్రీభవనంతో నైతికత పవనం
ప్లవనమొంది ఘనీభవించడంతో
మానవత్వవనంలో పూసిన ఓ చిరుమొగ్గ
హృదయం ఛిద్రమైపోయింది..
ముసి ముసి బోసినవ్వుల
పసితనం నుసివాడని
పసిడి బొమ్మ కామాంధుని
కసాయి కసికి మసియైపోయింది..
చిలిపి

మనసు మల్లెలు

మన ఊరంత శుభ్రము
పొందుదాం ఆరోగ్యము
అందరికీ ఆనందం
స్వచ్ఛభారత దేశము.

స్వచ్ఛ భారతా ప్రజలు
ఆనందాల బతుకులు
గ్రామాల్లో ఉన్నవి
శుభ్రమైనా వీధులు.

చెత్త బయట వేయొద్దు
క్రిములన్నీ పెంచొద్దు
అనారోగ్యంలో పడి
బతుకును కోల్పోవద్దు.

బడీ అందాలు చూడు
గురువులందర్ని వేడు
చెడ్డ పనులను చేసి
కాబోకు నీవు పాడు.

పిల్లల కోసం బడులు
పిల్లలకై పాఠాలు
గురువులు శ్రమించీ
నేర్పేనుగ అంశాలు.

పిల్లలు వస్తేనండి
కళకళలాడేను బడి
నేర్పించు నందరికీ
ఆనందనిలయమండి.

కరోనా సమయంలా
పిల్లలు లేక బడిలా
బోసిపోయెను తల్లి
భక్తులు లేని గుడిలా,

అవనిలోనీ అడవులు
వీచె చల్లని గాలులు
తినడానికి ఫలాలెన్నో
పొందండోయీ పిల్లలు.

చెట్లన్నీ నరికాము
కాలుష్యం పెంచాము
భూమాతకు కోపం
మనమంతా పెంచాము.

మనుగడ కోసం నీరు
చేయొద్దు వృధా నీరు
చెట్లను బాగా పెంచిన
పారునులే సెలయేరు.

దాహం తీర్చును నీరు
మబ్బులై నింగి చేరు
అవసరాలు తీర్చుటకు
తిన్నగ నేలను చేరు.

పచ్చదనం పెంచు నీరు
ప్రకృతనీత దేవతతీరు
గలగల పారు నదులతో
దర్శించండోయి మీరు.

వ్యవసాయానికి నీరు
ఊరి చెరువులోని నీరు
రైతుల అవసరం తీర్చు
పంటసిరితొ ఇల్లు చేరు.

ఉన్నది కొంచెం నీరు
పొదుపుగా వాడు నీరు
నీరు వృధా చేస్తేను
కరువున పడునే ఊరు.

నల్ల మబ్బులు పట్టాయి
వర్షనీగా మారినాయి
ఊరి కుంటలు నిండుగా
అలుగులన్ని దుంకినాయి

వర్షం కోసం రైతులు
ఎదురు చూసేనూ కనులు
టపటప పడెను వర్షం
పండె బంగారు పంటలు.

ఈ ఏడాది వర్షాలు
పొంగిపొరలెనూ వాగులు
నిండుకుండై మా చెరువు
తీర్చేను మా కస్టాలు .

చిటపట పడెను చినుకులు
నీటిల ఆడు పిల్లలు
సంతసాలు మా మదిలో
స్నేహితులతొ సరదాలు
20.
వర్షంలోనా ఆటలు
వర్షంలోనా పాటలు
చిన్ని పడవను చేసి
వదులుదామండి పిల్లలు.

వర్షనీ బాగ కురవాలి
పేద సాదా బతకాలి
గొడ్డుగోదలు బతికీ
కూలినాలీ దొరకాలి.

గురువుల మంచీ మాటలు
పాటించుదాం మిత్రులు
నీతులు ఎన్నో తెలిసి
నెరవేరునూ నీ కలలు

గురువులనూ విడువకు
వారిని ఎదురించకు
అతి తెలివిని చూపితే
భవిత ఉండదు నీకు.

కలిసి ఉండు గురువుతో
భయపడకూ వారితో
జ్ఞానాన్ని పొందుతూ
నడువు నీవు నీతితో

నీకు చెప్పెను గురువులు
వెలుగు నిచ్చే దారులు
నిబద్ధతతో ఎదిగితే
నెరవేరునూ ఆశలు

రంగు రంగు పువ్వులు
అలంకరణ సుమాలు
బతుకమ్మా పండుగకు
ఆనందపు నవ్వులు

రకరకాల పువ్వులు
తోటలోని పువ్వులు
అలంకరణకు అవసరం
ముచ్చటైన పువ్వులు

త్యాగాలకూ అంజలి
సంతసాలకు నెచ్చెలి
పూజలకు కావాలండి
పువ్వులె మదినిండాలి

గుత్తు గుత్తుల పువ్వులు
మాల కోసం పువ్వులు
సాంప్రదాయకమైనవీ
నాకు ఇష్టం సుమములు

దీపావళి వచ్చింది
మనసులనే దోచింది
వెలుగునే పంచుతూ
చీకటినీ తరిమింది.

దీపాలతో మా ఇల్లు
వెలుగుతోనూ వర్ధిల్లు
ముచ్చటైన గృహములో
ధనలక్ష్మితొ విలసిల్లు

టపాసుల శబ్దాలతో
మురిపించె దీపాలతో
అమ్మవారిని కొలిచీ
నడుద్దాం ఆశిస్సుతో

చిగురించే కొమ్మలు
వికసించే పువ్వులు
ముద్దుముద్దు పలుకుల
వాళ్ళేరా పిల్లలు.

రండి రండీ పెద్దలు
ఉన్నారోయి పిల్లలు
వారితో సరదాలోయి
ఇల్లంత సంబరాలు

కోపాన్ని తగ్గిస్తాము
ఇష్టాన్నీ పెంచుతాము
రేపటి వారసత్వమై
సంతోషాన్ని ఇస్తాము

పచ్చ పచ్చని పల్లె
పాడిపంటల ముల్లె
ఆనందాల నిలయము
స్వర్గంల విలసిల్లె

చిన్నపిల్లలు దేవతలు
వారి మాటలూ నిజాలు
స్వచ్ఛమైన మనసులతొ
మరపించేరు కష్టాలు

బాల్య వివాహాలు వద్దు
కూతురుకు చదువులు ముద్దు
వారిని బాధపెడుతూ
వారి ప్రాణం తీయొద్దు

నింగిలొ తారలము మేము
అవనిపై మల్లెలం మేము
ప్రతి చోట ఆనందములు
మేమేనోయి పిల్లలము

మాకు శ్వాసను ఇస్తావు
ఆహారం పంచుతావు
కలపను అందిస్తూ
వృక్ష మాతగ ఉంటావు.

శక్తిని ఇస్తావు నీవు
వెలుగును ఇస్తావు నీవు
తరగని శక్తి వనరుడు.
సూర్య భగవానుడు నీవు

రైతు కడుపున పుట్టాను
వారి కష్టం చూసాను
నేను చలించి పోయి
రైతుకు ఆసరవుతాను

తీసుకోకు లంచాలను
పిండకు నీవు పేదలను
నమ్ముతారు మిమ్మల్ని
ఆదరించు నిరుపేదలను

మట్టి వాసన చూడరా!
కమ్మగనే ఉండునురా!
పైరుగాలి పీల్చి చూడు
కోపమే తగ్గేనురా!

ప్రయోగాలు చేయరా!
ఫలితం సాధించరా!
నూతనంగా విషయాలు
మరెన్నో తెలుస్తాయిరా!

మా ఊరిలో చెరువులు
పూసేనుగ కమలాలు
మా కళ్ళకు కనువిందు
రంగులా హరివిల్లులు

మా తంగేడూ పువ్వులు
చిన్ని బతుకమ్మ నవ్వులు
పసుపారా బోసినట్లు
మనసులు దోచే పువ్వులు

హిందువులకు ఎరుపురంగు
క్రిస్టియనుకు తెలుపురంగు
ముస్లింలకు పచ్చరంగు
కలిస్తే మనసుప్పొంగు

అమ్మపాలు ఓ అమృతము
మనమందరం తాగాము
అదే మన అదృష్టనీ
ఆ తల్లినీ విడువకుము.

స్నేహబంధమే మాది
మంచితనం కోరేది
కలతలకు చోటులేని
ప్రేమ,ఆప్యాయతుంది

పచ్చని చెట్లు పెంచు
ప్రకృతినీ ప్రేమించు
ఆరోగ్యాన్ని అందించే
అడవులను రక్షించు

ఆడపిల్లలు దేవతలు
మన ఇంటి మహాలక్ష్మిలు
పొందు వారి ఆశీస్సులను
వాళ్లే మనకూ నీడలు

కోపమనేది మరువుము
ప్రేమతో నీ వుండుము
పరులకు సాయం చేస్తూ
మంచి పేరును పొందుము

దేవున్ని పూజించాలి
మనసులోనే కొలవాలి
భక్తితోనా ఉండీ
దైవశక్తిని పొందాలి

జంతువులనూ పెంచాలి
వాటి రక్షణ చేయాలి
నిండుగా ప్రేమించి
తిరిగి ప్రేమను పొందాలి

శాంతి, దయతో ఉండాలి
శౌర్య కాంతితొ మెలగాలి
మంచి భావనతో ఉండి
కృతజ్ఞతనూ చూపాలి.

-పాత్లావత్ పురందాస్
9వ తరగతి, జడ్‌పిహెచ్‌ఎస్, నేరళ్లపల్లి,
మహబూబ్ నిజీణజీతీ,7013264464

నాడు, నేడు- కుటుంబాలు

అనుబంధాలకు పుట్టిల్లు
అనురాగాలకు విరిజల్లు
ఆప్యాయతలకు పుట్టిల్లు
ఆపదంటే ఆదుకునే మనస్తత్వాలు
నిరాడంబరతకు సాక్ష్యాలు!

కలిమిలోనైనా, లేమిలో నైనా..
చేదోడు వాదోడుగా
ఉండే హృదయాలు
అంతా..మనమంతా ఒక్కటే,
అనే..ఆనాటి మన కుటుంబాలు..!

కానీ, నేడు..
ఆడంబరాలు-అధికమయ్యాయి
అనుబంధాలు-బందీ అయ్యాయి
అనురాగాలు మసి బారాయి
ఆప్యాయతలు ఆవిరయ్యాయి!

ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా
అయిన వాళ్లనెవ్వరిని పట్టించుకోరు
ఆపదలో ఉన్నామన్నా పట్టించుకోరు
ఆదుకునే తత్వం లేని వారు!

సంపదల వేటలో..డాంబికాలమోజులో
ఉచ్చు నీచాలు మరుస్తున్నారు
ధనం వెనుక పరుగెడుతున్నారు..
మనమధ్య బంధాలు ఉన్నాయని
మరిచిపోయారు!

నాటికి నేటికి ఎంతో తేడా..
ఇది కొనసాగుతూనే ఉంది..
నేటికీ ఈ వేళ!!

-ఎన్.. రాజేష్
9849335757

పెద్దవారు(వృద్ధులు)

ముదిమి వయసునున్నవారికి
కుటుంబమున చేయూతివ్వండి..!
అనారోగ్యము పాలైనచో
ఆమద దూరమునుండకండి..!!

వృద్ధులపైకెపుడు హద్దుమీరి
మాట్లాడుకుంటు వుండకండి..!
సభ్యత కల్గిన మాటలతోడ
గౌరవించుకుంటు వుండండి..!!

పెద్దల అనుభవాల మాటలిని
భవిష్యత్తుకు బాటేసుకొండి..!
వారి మాటలకు విలువీయక
బతుకులాగం చేసుకోకండి..!!

పెద్దవారి మాటలిన్నచో
కాపురము సజావుగా సాగును..!
లోటు,పాటులెమైనా వచ్చిన
సర్దుకునే జ్ఞానము అలవడును...!!

-పసుల.శంకర్
9542181301

అందమా నీవెక్కడా!

అందమా
నా డెందమా
నా చంద్రమా
నా బంధమా

అందమా
నా ఆనందమా
నా కమ్మదనమా
నా కంటిదృశ్యమా

అందమా
నా వెలుగా
నా మార్గమా
నా లక్ష్యమా

అందమా
నీవెక్కడా
నీతావులెక్కడా
నీచిరునామా తెలుపుమా

అనగానే
అందమొచ్చె
సమాధానమిచ్చె
సందేహమిలాతీర్చే

ఇక్కడా అక్కడా
అనేసందేహం వలదుసుమా
ఎందెందు వెదికిచూచినా
అందందే తప్పక ఉంటా

పువ్వుల్లో ఉంటా
పరికించేవారికెల్లా
పొంకాలుచూపుతుంటా
పులకరిస్తుంటా

అతివల్లో ఉంటా
అణిగిమణిగి ఉంటా
అందుకోగలిగేవారినెల్లా
ఆనందపరుస్తుంటా

పసిపాపల్లో ఉంటా
పిల్లలపలుకులలో ఉంటా
ప్రక్కనున్నవారిని
పరవశపరుస్తుంటా

నింగిలో ఉంటా
నీలిమబ్బుల్లో ఉంటా
మేఘాల్లో ఉంటా
హరివిల్లులో ఉంటా

చంద్రునిలో ఉంటా
చక్కనివెన్నెలలో ఉంటా
చుక్కల తళతళలలో ఉంటా
చూపరులను సంతసపెడుతుంటా

పుడమిపై ఉంటా
పచ్చనిచెట్లలో ఉంటా
పంటపొలాల్లో ఉంటా
ప్రకృతిలో ఉంటా

ప్రభాత సూర్యునిలో ఉంటా
అరుణకిరణాలలో ఉంటా
అస్తమించే రవిరంగులలో ఉంటా
విశ్వమంతా వ్యాపించి ఉంటా

కొండల్లో ఉంటా
కోనల్లో ఉంటా
అరణ్యాలలో ఉంటా
సెలయేర్లలో ఉంటా

నదినీటిలో ఉంటా
సరస్సులలో ఉంటా
సముద్రాల్లో ఉంటా
వాటితీరాలలో ఉంటా

కళ్ళల్లో ఉంటా
కనగలిగేవారికి కనపడతా
కళకళలాడుతుంటా
కనువిందులు చేస్తుంటా

మనసులలో ఉంటా
మేధస్సులో ఉంటా
మురిపిస్తుంటా
మయిమరిపిస్తుంటా

-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
9177915285

వెలుగు దివ్వెలు

ఆకలి మంట కడుపును సలుపుతుంటే
పేగులు ఎండిన దారాలై
డొక్కలు బొక్కలై రక్తం ఆవిరై
పొట్ట వెన్నెముకకు పూతగా మారితే
ఎంగిలి మెతుకులు ఏరుకుంటూ
చిరిగిన అతుకుల్లో కనిపించే
బాల్యానికి ఓ వెలుగు కిరణం
కావాలిప్పుడు.

ఎన్నో చట్టాలు,ఎన్నో ఆదరణ
అందించే చేతులు, ఎన్నో బడిబాటలు,
ఎన్నో చదువుల పండుగలు....ఎన్ని
వచ్చినా మారని రాతలు, మాయని గీతలు...చితికిన బాల్యం నలిగిన హృదయం. ఇప్పుడు ఆ బాల్యానికి కొన్ని వెలుగు దివ్వెలు కావాలి.వెలుగు దారిలో అక్షరాలు ఏరుకుంటూ పేర్చుకుంటూ, నేర్చుకుంటూ, కూర్చుకుంటూ బతుకు బాటలో వెన్నెల చిరునవ్వులా విరబూయాలి. ఇదిగో మన వ్యాయామ ఉపాధ్యాయులు పిల్లి హజరత్తయ్య గారు "వెలుగు దివ్వెలు" వారి కోసమే తెచ్చారు.

నిత్యం విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ వారిలో ఒకరిగా మమేకమై బాసటగా నిలుస్తున్నారు.

" పుట్టిన పిందె పండు
కాకముందే కోసినట్లు
లేత ప్రాయంలోనే శిశువులను
మొగ్గలోనే తుంచేస్తున్న
జాలిలేని కామాంధుల
వికృత చేష్టలు వలన
బాలల పసిప్రాయం
గనుల్లో, ఫ్యాక్టరీలలో పనుల్లో
చిక్కిశల్యమవుతుంది"

తన ఆవేదనను ఆవేశంగా నిలదీస్తూ ధైర్యంగా ప్రభుత్వాలను బాలకార్మిక వ్యవస్థ పై ఉక్కుపాదం మోపాలని నినదిస్తున్నారు.చితికిన బతుకుల్లో వెలుగు దివ్వెలు పూయిం చాలని అటు తల్లిదండ్రులను, సమాజాన్ని, ప్రభుత్వాలను, ఆదరించే మనసులను కదిలించే సంఘటనలు గుర్తుచేస్తూ ప్రశ్నిస్తూ ప్రక్షాళన చేద్దాం అంటున్నారు

"అక్షరము నేర్చితే విద్యార్థి
అక్షరము నేర్చితే ఉపాధ్యాయుడు"

అక్షరములు నేర్చుకుని విద్యార్థి దశ నుండి ఆ అక్షరాన్ని అందరికి నేర్పే ఉపాధ్యాయ స్థాయికి ఎదిగిన శ్రీ పిల్లి హజరత్తయ్య గారు మొదటిసారిగా కవితా వనంలోకి ప్రవేశించి తన వంతు గా కొన్ని కవితా పుష్పాలను పూయించి "వెలుగు దివ్వెలు" అనే శీర్షికతో పూల మాల గా మార్చిన హజరత్తయ్య గారికి అక్షరాభివందనాలు.

పువ్వు పువ్వు కు ఒక సువాసన ఉంటుంది అలాగే ప్రతి కవిత కు ఒక భావం ఉంటుంది. వెలుగు దివ్వెలు కవిత్వ సంపుటి లోని ప్రతి కవితా ఒక్కొక్క ప్రత్యేకమైన భావాలతో అలరారుతూ హృదయాలను కదిలించే అనుభూతులు నిస్తున్నాయి సాహిత్య పరమార్థాన్ని చక్కగా వ్యక్తం చేస్తున్న కవిత "కలాలను ఝుళిపించాలి" అంటూ అద్భుతమైన రీతిలో తెలియజేశారు.

"సమాజ హితమే లక్ష్యంగా
సమభావనే ధ్యేయంగా
సాహిత్య దృక్పథమే ఆశయంగా
సమాజ శ్రేయస్సే పరమావధిగా
నిజాయితీ నిప్పులై విరజిల్లాలి"

అంటూ కవులకు దిశానిర్దేశం చేశారు.

కవిత్వముకున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని మనం బాధ్యతతో మెలగవలసి ఉంటుందని తెలుపుతూ "ఎదలోతులను మీటాలి" అనే కవితలో కవుల కర్తవ్యాన్ని ప్రబోధించారు

"సామాజిక దురాగతాలపై గళమెత్తి
సమస్య పరిష్కారానికై కలంపట్టి
సాధన మార్గాలను చూపించు"

అంటూ ఆలోచనామృతాన్ని రేకెత్తించారు సామాజిక స్పృహతో సమాజం పట్ల బాధ్యత కలిగి స్పందించి చేసే భావ ప్రకటనే కవిత్వమని చెప్పకనే చెప్పారు

వాస్తవాలను అస్త్రాలుగా మలచాలనే తపన, నిజాలను నిర్భయంగా చెప్పాలనే వజ్ర సంకల్పం కలిగిన మనస్తత్వం హజరత్తయ్య కవిత్వంలో దర్శనమిస్తుంది ఆయన "మౌనవ్రతదీక్ష "అనే కవితలో సామ్రాజ్యవాద మూలాలను ఎండగట్టాడు

"యుద్ధం తరువుకు
గెలుపు పూలు పూసినా
సంతోష పరిమళాలన్నీ
చెరగని గాయాలై
నెత్తురోడుతూనే ఉంటాయి"

అంటూ ఉక్రెయిన్ పై రష్యా సాగిస్తున్న యుద్ధము పట్ల చివరికి సాధించేదేమీ ఉండదని వాస్తవాలను కళ్ళకు కట్టే ప్రయత్నం చేశారు.

"ఆప్యాయత అనురాగాలు లేనిచోట
బంధాలు వెతకడమంటే ఎండమావులో నీటి చెలమకై అన్వేషించడం లాంటిదే"

అంటూ సమాజంలో మృగ్యమై పోతున్న అనురాగాలను అనుబంధాలను బతికించుకోవడానికి ప్రతి ఒక్కరూ తప్పక కృషి చేయాలనే లోతైన భావాన్ని వ్యక్తీకరించారు "ఆత్మీయ పలకరింపు" అనే కవితలో కవి.

"అక్షరమే ఆయుధమైతే"అనే కవిత మొత్తమూ ఆలోచనాత్మకమే, ఆవేదన భరితమే

"రాత్రింబవళ్ళు కష్టపడి పనిచేసినా
నాలుగేళ్ళు నోట్లోకి వెళ్ళని
పేదరికపు పురిటి నొప్పులను
ప్రశ్నిద్దాం " అంటూ భారతదేశంలో పేదరికపు మూలాలను ప్రశ్నించాడు కవి.

కదిలించే ఘటనలే కవిత్వమని... కవి బాగానే విశ్వసించినట్లున్నారు. అందుకే కామాంధుల రాక్షస క్రీడలను ఆపాలంటూ సింహగర్జనే చేశాడు.

"రాబంధుల నీలి నీడల్లో
అన్యం పుణ్యం ఎరుగని
పసిమొగ్గల జీవితాలు చితికిపోతే
బరువెక్కిన తల్లి మనసుకు
ఓదార్పు నిచ్చేదెవ్వరు" అంటూ

బాలికలపై జరుగుతున్న అకృత్యాలపై తనదైన శైలిలో ప్రశ్నిస్తూ సమాజంలోని అమానవీయ కోణాన్ని కళ్ళకు కట్టే ప్రయత్నం చేశారు

సమాజంలోని ప్రజలు ప్రశ్నించే తత్వమును మానేసి ప్రతిదానికి ఇతరులు చెప్పినట్లు కదులుతుంటే మన ఎదుగుదలను మనమే ఆపుకోవడం

అంటాడు కవి. 'ఔను సహజత్వం చచ్చిపోయింది' అనే కవితలో మనిషి యాంత్రికతను ఎండగట్టే ప్రయత్నం చేశాడు

"డిజిటల్ మాయలోపడి
గొర్రెలా తోకాడిస్తూ
బురిడీ కొట్టించుకున్నప్పుడే
సహజత్వం చచ్చిపోయింది" అంటూ

మనిషి రాను రాను యాంత్రికంగా తయారై జీవితంలో కష్టాలు కొని తెచ్చుకుంటున్నాడని చెప్పారు కవి.

సామాజిక అంతరాలపై చేసే వైద్యం కవిత్వమని నమ్మినట్లుంది కవి. అందుకే స్వాతంత్ర ఫలాలు అందరికీ అందాలనే కవితలో గాఢంగా ఆకాంక్షించారు కవి.

''సామాజిక రుగ్మతలను అంతమొందించి
సామాజిక వివక్షలను నిర్మూలించి
సామాన్యులకు ఉద్యోగఅవకాశాలు కల్పించి
సమాన హక్కులను పరిరక్షించి
ప్రజలకు భరోసా ఇవ్వాలి" అంటూ

సామాజిక ఫలాలు అందరికీ అందినప్పుడే నిజమైన స్వాతంత్ర్యానికి అర్థం పరమార్థం చేకూరుతుందని ఆశించారు కవి.

కవికి సామాజిక స్పృహతో పాటు దానికి తగ్గా సృజనాత్మకత ఉండాలి దీనితోపాటు అలంకార వైశిష్ట్యం వస్తునవ్యత,భావవ్యక్తీకరణా నైపుణ్యం వస్తుంది ఈ అంశాలపై కవి బాగానే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది "అవనిపై అద్భుతం" అనే కవితలో అవి మనకు కనిపిస్తాయి

"అక్కడ శిల్పం కదులుతోంది
పురివిప్పి నాట్యం చేసే మయూరంలా
మధుర భావాలను పలిగిస్తోంది
సరిగమలు పలికించే వీణలా"అంటూ

వాడుక పదాలతో అర్థవంతమైన కొనసాగింపు నిస్తూ ఆలోచింపజేసేలా హృదయాలను కదిలించేటట్టు కవిత్వీకరించారు హజరత్తయ్య గారు.

కొందరి కవిత్వం ప్రేరణ కలిగిస్తుంది. కొందరి కవిత్వం స్పందన రేకెత్తిస్తుంది. కొందరి కవిత్వం మనసును రంజింప చేస్తుంది. కొందరి కవిత్వం కదిలిస్తుంది. కొందరి కవిత్వం మనసులోని మలినాలను శుభ్రం చేస్తుంది.ఆ కోవకు చెందిన కవిత్వంగానే హజరత్తయ్య గారి కవితా సంపుటి మనకు కనిపిస్తోంది

మంచినే చూసే మనసుంటే ప్రతిమలు సైతం స్నేహసుధలై పూస్తాయని చాటే కవనకేతనమే పిల్లి హజరత్తయ్య. వస్తు

పుస్తక సమీక్ష

వైవిధ్యమును కొంతమేర ప్రదర్శించి కొత్త అంశాలను పరిచయం చేసే ప్రయత్నం పాఠకులను తప్పక ఆకట్టుకుంటుంది. ఈ కవితా సంపుటిలోని కవితలన్నీ సరళమైన పదాలతో వాడుకభాష పదాలతో లోతైన భావాలను పలికించడంలో కవి సఫలీకృతం అయ్యారు. అనేక సమకాలీన సామాజిక అనుభూతులను ఉటంకించారు. అనుభవాల నిఘంటువులా తన అనుభవాలను అనుభూతమయ్యేటట్లు చేయగలిగారు.

ఈ పుస్తకంలో నా జీవన ప్రయాణంలో నా పాదాలు మాత్రమే నన్ను నడిపించలేదు అనేక పాదాలు నడిపించిన దారులు నన్ను నడిపించాయంటూ "నేటిదాకా" అనే వ్యాసంలో తనను నడిపించిన అందరినీ గుర్తు చేసుకోవడం ఆయన కవితా సంస్కారానికి పరాకాష్టగా చెప్పవచ్చు. నా బతుకు బాటలో వెలుగు దివ్వెలు వెలిగించిన తల్లిదండ్రులకు, బంధువులకు, శ్రేయోభిలాషులకు, కృతజ్ఞతాభివందనాలు తెలియపరచడం బాగుంది. తన కవితా సంపుటికి ముందుమాట అందించిన కందుకూరు శాసనసభ్యులు శ్రీ మానుగుంట మహీధర్ రెడ్డి గారికి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీ కత్తి నరసింహారెడ్డి గారికి, శ్రీ శ్రీ కళా వేదిక చైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్ గారికి, నాగార్జున విశ్వవిద్యా లయం ఆచార్యులు డాక్టర్ ఎన్.వి కృష్ణారావు గారికి, మరియు ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ ఆచార్యులు డా.తరపట్ల సత్యనారాయణ గారికి విమర్శకులు,కవి, చిత్రకారులు కొంద్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి గారికి మరియు శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు చెబుతూ తలుచుకోవడం ఆయన లోని వినయానికి నిలువెత్తు నిదర్శనంగా చెప్పవచ్చు.

ఈ పుస్తకాన్ని చాటలు నెత్తినెత్తు కొని, కాళ్లు అరిగేలా ఊరూరా తిరుగుతూ రెక్కలు కష్టంతోవారిని కంటికి రెప్పలా కాపాడుతూ నడిపించిన తన తల్లి శ్రీమతి పిల్లి తాయారమ్మకు అంకితమిచ్చి మాతృ ప్రేమను చాటుకున్నారు. ఏదిఏమైనా అనుభవాల కొలిమిలో కాగి అవగాహన బలిమితో కవిత్వమై సాగిన పిల్లి హజరత్తయ్యగారు మున్ముందు 'జబర్దస్త్' కవిత్వం రాయాలని ఆశిస్తూ తొలి ప్రయత్నంలోనే పాఠకులకు రసానుభూతిని అందిస్తూ, విశ్వ ప్రేమను ఆకాం క్షిస్తూ ఆ దిశలోనే సఫలీకృత మయ్యారని విశ్వసిస్తున్నాను. హజరత్తయ్య గారు ఇంకా పదునైన పదాలు ప్రయోగించగలరు , ఆ దిశగా వ్రాయాలని నా అభిప్రాయం. చెప్పదలచుకున్న విషయాన్ని కొన్ని చోట్ల సరళంగా సులభంగా కాక దృఢంగా వుంటే ఇంకా అద్భుతంగా వుంటుంది. మీరు ఇంకా అందమైన అద్భుతమైన సంకలనాలు అందిం చాలని నా తరపున శ్రీ కళా వేదిక తరపున శుభాభినందనలు తెలుపు తున్నాను. ఈ అవకాశం కల్పించిన చైర్మన్ డా. కత్తిమండ గారికి, జాతీయ కమిటీ, చదివి ఆదరిస్తున్న కవులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుం టున్నాను.

-ఈశ్వరీభూషణం జి
జాతీయ ప్రధాన కార్యదర్శి
శ్రీ శ్రీ కళా వేదిక.

రేపు మన గతేమిటో?

(కథ)

తన ఏకైక పుత్ర రత్నానికి పెళ్లైన పదేళ్లకు గాని సంతానం కాలేదు. కొడుక్కు సంతానం కాలేదని చాలా బాధపడే వాడు వృద్ధుడైన మల్లయ్య. ఏదైతేనేమి ఎదిరిచూస్తున్న తనకి మనవడు పుట్టాడు. కుటుంబమంతా సంబరపడి పోయింది.

బుడ్డోడు బుడిబుడి నడకలతో ఇంటిళ్ళల్లాడులను అలరిస్తున్నాడు. బుడ్డోడి బోసినవ్వులు చూసే భాగ్యం లేదు వాడి నానమ్మకి ఆవిడేప్పుడో బాల్చి తన్నేసింది "ఆవిడ కూడా ఉండుంటే ఎంత సంబరపడేదో" అనుకుంటూ బాధపడే వాడు మల్లయ్య.

ఎలాగైతే బుడ్డోడు పెరుగుతున్నాడో మల్లయ్యలో దగ్గు జ్వరం మాటి మాటికి రావడం ఎక్కువైపోయింది.

మనవడిని ఎత్తుకొని ముద్దాడుదామంటే కోడలు వాన్ని తనవైపే రానిచ్చేది కాదు. అడిగితే "నీ పాడు రోగం నా కొడుక్కి సోకుతుంది" అని గద్దించి పెట్టేది.

చేసేదేమి లేక తనలో తాను కుమిలిపోయేవాడు ముసలాయన. అప్పుడప్పుడు అనిపించేది. 'ఆ ముసలిది ముందే పోవడం మంచిదైంది. ఆమె ఉండుంటే ఇంకెంతగా కుమిలిపోయేదో' అని

బుడ్డోడు పెరిగినా కొద్ది మల్లయ్యలో రోగం కూడా పెరిగిపోతోంది.

తన కొడుక్కి పెండ్లాం మీద మనవడు పుట్టక ముందున్న కోపం ఇప్పుడు లేదు, ఇపుడు పెళ్ళామంటే బెల్లం అయిపోయింది వాడికి. ఆమె మాటేవేదం, ఆమె మల్లయ్యను తిట్టి, చీవాట్లు పెట్టినా కుయ్యుమనడం లేదు. అందుకే కోడలి నోటికి చేతలికి అడ్డూ అదుపు లేకుండాపోయింది.

ముసలాయనని చీటికీ మాటికి చీదరించుకుంటుంటే అది చూడలేక ఒకరోజు తన కొడుకు "ఏమే సుబ్బలక్ష్మీ! మా అయ్యను అంతలేసి మాటలంటున్నావెంటే..?' అని.

ఇలా అడిగాడో లేదో వెంటనే విరుచుకుపడ్డూ ఏంటీ లేక లేక కలిగిన నా బంగారు కొండ నాకు దూరం చేస్తారా? ఆ ముదనష్టపు రోగం అంటించ చూస్తున్నాడు ఆ ముసలాడుమీకు తెల్వదు. అయినా 70-80 ఏండ్లు దాటాయి కదా! ఇంకెన్నేండ్లు బతుకుతాడటా? అటు భూమికి ఇటు మనకూ భారమై, నీకేమీ కోట్ల ఆస్తి సంపాదించి ఇవ్వలేదు మీ అబ్బ. బోడి ఒక చిన్న కొంపా, నాలుగెకరాల చేను అంతేకదా?, అయినా ఈ వెధవ శాల్తీనీ ఇంకెన్ని నాళ్లని మోస్తాం. చాలు చాలు కరోనా వైరస్‌తో ఎంతోమంది బతకాల్సిన యువకులు చస్తున్నారే? ఈ ముదునష్టపోనికి చావు రాదా! ఏదో ఒక తోవ చూసుకుని చావొచ్చు. కదా!.. మెడ మీద చెయ్యేసి గెంటేస్తే గాని వెళ్లేట్లు లేదు" ఇలా నానా తిట్లతో ఇంటి నుండి వెళ్ళిపోయెట్టు చేసింది కోడలు.

చీము నెత్తురున్న వాడెవ్వడూ ఆ మాటలకు ఒక్క క్షణం కూడా అక్కడుండలేడు.

పెళ్ళాం మాటలు వినలేక కొడుకెప్పుడో పనికెళ్ళి పోయాడు. ఏమీ తోచడం లేదు మల్లయ్యకు కడసారి మనవడివైపు దీనంగా చూశాడు, ఇవే చివరి చూపులన్నట్లు, కళ్ళల్లో నీరు ఉప్పొంగి వస్తుంటే మూలకున్న చేతికర్ర తీసుకొని బయలు దేరాడు ఎక్కడికో.

అప్పటికే తన గమ్యం లేని ప్రయాణం మొదలై రెండు రోజులు గడిచాయి. ఆకలైతే సిగ్గిడిసి అడుక్కు తింటున్నాడు అప్పుడప్పుడు, లేదంటే పస్తులే రెండు మూడు సార్లు చద్దామని ప్రయత్నించాడు కూడా. ధైర్యం చాలలేదు పిరికితనంతో ఆగిపోయాడు.

అప్పటికే వారం గడిచిపోయింది. ఒంట్లో సత్తువున్నంత వరకు, నడక సాగిస్తూనే ఉన్నాడుముసలాయన.

ఒకచోట తోవలో వందలకొద్దీ జనం పోగై ఉంది. పోలీసులు ఉన్నారు. జనాల్నందర్ని వరుసలో నిలబెట్టి పేరూ వివరాలు అడిగి భోజనం పాకెట్టు ఇస్తూ " మీరందరూ లాక్‌డౌన్ పూర్తి అయ్యేంతవరకు ఇదిగో ఈ గుడారాల్లోనే ఉండాలి" అని చెప్పి అందులో ఉంచేశారు. వారితో బాటు మల్లయ్యనూ ఉంచేశారు.

ఇలా లాక్‌డౌన్ ఎత్తేసే వరకు అక్కడే ఉన్నాడు. ముసలాయన.

కొంత కాలినికి కరోనా వైరస్ ఉధృతి తగ్గగానే అందరినీ ఎవరి గమ్య స్థానాలకు వార్ని పంపిస్తున్నారు.

కాని మల్లయ్య "నేను మాత్రం వెళ్లను సార్ నేనిక్కడే ఉంటాను" అని అంటుంటే "ఎందుకూ ఏమిటీ" అని ఇలా వివరాలన్నీ ఆరాతీసి "మేము సరిదిద్దుతామని" హామీ ఇచ్చి తీసికెళ్ళారు తన ఇంటికి మల్లయ్యను పోలీసులు.

తీరా చూస్తే ఇంటికి తాళం వేసుంది, "ఏమిటూ?" అని పక్కింటి వారినడిగితే "అయ్యో! నీకు తెలువదా మల్లయ్య బాబాయ్ నిన్ను ఇంటి నుండి వెళ్ళగొట్టిన మరునాడే దుబాయ్ నుండి వచ్చిన మీ కోడలి తమ్మునితో బాటు, ఆమె తల్లిదండ్రీ కూడా వొచ్చి ఇక్కడే వారం పది రోజులున్నారు.."

"అయితే ఏమైందీ?.." అని అడిగాడు ఆశ్చర్యంగా మల్లయ్య.

'ఏమైంద్ కాదు బయటి దేశాల నుండి వచ్చిన వారితో కరోనా వైరస్ పాకుతుందట కదా! అందుకని ఆమె తమ్ముణ్ణి అతనితో బాటు కల్సి ఉన్న వారినందరినీ పరీక్షించడానికి తీసుకెళ్లారు. అదీ సంగతి, పాపం నిన్ను అనవసరంగా గెంటేశారు. నీ ఉసురు ఊరికే పోలేదు లే.." అన్నారు వాళ్లు.

అయ్యో! నా కొడుకూ నా మనవడూ.." అంటూ మల్లయ్య గుండెలు బాదుకుంటుంటే.

మళ్లీ పక్కింటావిడ అందుకుంటూ "తత్తిమా వాళ్లకేమీ కాలేదట, వారందర్నీ క్వారంటైన్ల ఉంచి, ఆమె తమ్మున్ని మాత్రం ఐశోలేషన్లనే

అంతర్జాల ఆటలకు అసువులు బాసెను

కరోనా క్రిమి వచ్చి
కల్లోలం సృష్టించే
కుటుంబాల్లో సొచ్చి
కకావికలం చేసే
చిన్న పెద్ద తేడనక
ప్రాణాలను తీసుకెళ్లే
భయం గుప్పిట్లో
జనులు తల్లడిల్లే.

బయటకెళ్లుట
బందు ఆయెను
ఇంట్లోనే వుండు డాయేను
పిల్లలకు పాఠశాలలు
నడుచుట ఆగిపోయేను
చరవాణిలోనే
పాఠ్యాంశాల బోధనాయేను
ఉన్నోల్ల పిల్లలకు
విరివిగా దొరికే చరవాణిలు
పేదొల్ల బిడ్డలకు
బువ్వ దొరుకుడే కష్టమాయెను.

సదువుకుంటే బాగుపడతరని
తలచిన పేద తల్లిదండ్రులు
అప్పు సప్పు చేసైన
చరవాణిని చెంతనుంచెను
చదువుతో పాటు పిల్లలు
ఇంట్లో వుంటరనుకొనిరి కన్నోళ్లు
తెలియనివి చూసుకుంటూ
ఆడనివి ఆడుకుంటూ
అంతా చెడిపోయెను అల్లరి పొరలు
అంతర్జాల ఆటలకు అలవాటుపడి
ఉన్న సదువుసంత మరిచెను
గడుసరి పొరలు.

పబ్జీ ఆటకు మరిగి
పాఠాలు వినుడు మరచెను
పొద్దంతా ఆడుతూ
రాత్రంతా కలవరిస్తుండెను
ప్రత్యక్ష బోధనలు జరుగుతున్న
పబ్జీ ఆటను వీడకుండెను
సోపతోల్ల తోటి గూడి
రాత్రంతా ఆడుతుండెను
ఆటలో ఓడినావని
ఆటపట్టించుటకు అంటే
అవమానాన్ని తట్టుకోలేక
అసువులు బాసెనోక
అమాయకపు ఆంధ్రరాష్ట్ర విద్యార్థి
అది చూసి తట్టుకోలేక
ఆర్తనాదాలు పెడుతుండె
కని పెంచిన తల్లిదండ్రులు.

నేటి బాలలు
సున్నిత మనస్కులైరి
సమాజ పోకడలు
తెలియకుండిరి
పోటీతత్వమును
పెంచుకోకుండిరి
గుండె ధైర్యమును
కల్లిలేక పోయిరి
కనిపించి నోల్లకి
కన్నీళ్ళే మిగిల్చిరి
ఆధునికతకు అనుగుణంగా
అలవాట్లు మార్చుకోవాలి
అన్నింటిలోనూ మనము
అందేవేసెలా ముందుండాలి
(మచిలీపట్నం టౌన్ యందు పబ్జీ ఆటలో ఓడినావని మిత్రులు ఆనడముతో అసువులు బాసిన విద్యార్థి... నేటి యధార్థ సంఘటన)

– పసుల.శంకర్
9542181301

నిస్వార్థ జీవి

పల్లవి:మల్లె కన్న తెల్లనైన
మంచు కన్న చల్లనైన
మనసున్న ఓ నాన్న
మమతున్న ఓ నాన్న
వెన్నెలనీత హాయియైన
వెన్న కన్న మెత్తనైన
మది వున్న ఓ నాన్న
హృది ఉన్న ఓ నాన్న.

చ॥కష్టాన్నే నమ్ముకున్న కర్మజీవే నాన్న
ఇష్టాల్ని నెరవేర్చే ధన్యజీవే నాన్న
లోకాన్నే చూపే మార్గ దర్శి నాన్న
శోకాన్నే మాపేటి బుద్ధుడే నాన్న.

కరుగుతు వెలుగు పంచే దీపమే నాన్న
అరుగుతు గంధం పంచే రూపమే నాన్న
తరుగుతు వెన్నెల నిచ్చే త్యాగమే నాన్న
ఒరుగుతు ఓరిమి
నింపే ధైర్యమే నాన్న.

చ॥బ్రతుకంతా తోడుగ నిలిచేదే నాన్న
తప్పటడుగుల్లోన చేయూతే నాన్న
కష్టాల కడలిలోన దిక్సూచే నాన్న
నష్టాల దారుల్లో వెన్నుదన్నే నాన్న

చ॥శిశిరనీలోన ఆమని కోయిలే నాన్న
అమాసలోనా పున్నమి చంద్రుడే నాన్న
చెమట చుక్కల్లోన స్వర్గమే నాన్న
చెరకు గడలలోనా తియ్యదనమే నాన్న



–గుండాల నరేంద్రబాబు
9493235992

మనసైన ఉత్తరం

ఉత్తరం రాయడం నాడు బడిలో పాఠం
సంభోధన నుంచి శుభం పలికేవరకు
వరుసకట్టే ఆలోచనలు హితబోధలు
పెద్దలు రాసిన లేఖలు
పంచాయి ప్రపంచ జ్ఞానం
సాహిత్యంలో పెద్దపీటేసుకుని కూర్చున్నవవి.

మనసుపెట్టి రాసే లేఖ పంచే ఊహలు
మంచినీటి బావి లోంచి తోడుతాయి మమతల్ని
మదిని తట్టిలేపే ఊటలూరే జ్ఞాపకాలు
మల్లె పూల సువాసన రాకున్నా
చెమట వాసన కమ్మదనం అదరగొడుతుంది.

అమ్మ కొంగుతో తుడుచుకున్న కన్నీళ్లు
పిల్లలకు తినిపించిన ప్రేమ ముద్దలు
ప్రేయసి ముసిముసినవ్వుల మృదుత్వం
సైగల బెదిరింపులు, ఊరడింపులు
వేడుకోళ్ళు, వెక్కిరింతలు అన్నీ
కమ్మని కిచిడీ చేసి వండి పెట్టినట్లుండేవి లేఖలు.

పోస్ట్ కార్డు, ఇన్ లాండ్ లెటర్, కవర్
మినీ కవిత్వం నుంచి దీర్ఘ కవిత్వంలా
వాక్యాలన్ని మాట్లాడించేవి మళ్లీ మళ్లీ
గద్ద వాలినట్లు టెలిగ్రాం వాలేది.

పోస్ట్ అన్న పిలుపు కోసం ఎదురుచూపుల ఆతృత
ఇంట్లోకి వాకిట్లోకి సాలు పోసిన నడకలు
ఉత్తరాలు ఎన్ని యాదులను తవ్విపోసేవి
గుండెల్ని పిండి ఆరేసేవి, తడిపేవి
అక్షరాల పూల నుంచి తేనె సేకరించినట్లుండేవి
ఉత్తరం రుచి అప్పుడే కలిపిన కొత్తావ సోగి

మనసుపెట్టి రాసిన లేఖలోని వాక్యాలు
తలపుల్లోకి వచ్చే అనుభూతుల మెరుపులు
దారిచూపే మిణుగురు పురుగులు
ఒక్కోసారి సురుకుల్లా తగిలినా, వాతలు పెట్టినా
ముళ్ళ కంపలు ఏరేసి దారి సుగమం చేసేవే

–కొమురవెల్లి అంజయ్య
9848005676

జీవితానికి దశ దిశ నాన్న

నాన్న అంటే భద్రత
నాన్న అంటే నమ్మకం
నాన్న అంటే ఒక ధైర్యం
నాన్న అంటే ఒక రక్షకుడు
నాన్న తోనే జీవితం
అడుగులు నేర్పి
అణుకువ అర్థత
ఆత్మీయత ఆదరణ
అనురాగాలు రంగరించి.

బంధాలను అనుబంధాలను
పెంచింది పంచింది నాన్న
మమత మానవీయత
మర్యాదలు నేర్పిన
తొలి గురువు నాన్న
జీవిత సత్యాలను
బోధిస్తాడు
జీవితానికి దశ దిశ నాన్న

–నేదునూరి కనకయ్య
9440245771

పుస్తక సమీక్ష

వర్తమాన కవిత్వం "పైసల చెట్టు"

అనుభూతి ప్రపంచాన్ని అనుభవంలోకి తీసుకువచ్చే శక్తి కవిత్వంకకున్నది. ఇదే రన హృదయులలో రసానుభూతిని ప్రవింపజేసి జీవితాన్ని అర్థవంతంగా సంస్కారవంతంగా చేస్తుంది. కవిత్వం అభి వ్యక్తి ఒక కళ. ఒక విషయాన్ని కొత్తదనంతో చెప్పాలంటే ఆ శక్తి కేవలం కవిత్వానికి ఉంది.

రచయిత డాక్టర్ భాస్కర్ గారు తన కవితల సంపుటికి పెట్టుకున్న పేరు "పైసల చెట్టు". ఆలోచించే దగ్గ విషయ మేమంటే ప్రతి వ్యక్తి బాల్యంలో పైసల చెట్టు తారసపడుతుంది. ఎందుకంటే పిల్లలు పైసలు కావాలని మారం చేసినప్పుడు పెద్దవాళ్లు పైసలు "చెట్లకు కాస్తున్నాయా" అంటారు. వృధాగా ఖర్చు పెట్టినప్పుడు కూడా ఇదే మాట అంటుంటారు. రచయిత చిన్నప్పుడు వాళ్ళ నాన్నను పైసలు అడిగితే పైసల చెట్టు నాటుతున్న అనేవాడు అనహనానికి లోనయ్యేవాడు. పైసల విలువ తెలుసుకొని పెరిగాడు. అందుకే తను తన కవిత సంపుటికి పైసల చెట్టు

శీర్షిక ఎన్నుకున్నాడు.

ప్రతి స్త్రీలో అమ్మను దర్శించమంటాడు కవి .అందుకే స్త్రీ విశ్వరూపాన్ని " ఆకాశమంత అమ్మ" లో చూపించే ప్రయత్నం చేశాడు.

ఆడదంటే ఆడేదని కాదు/నిన్ను పొత్తిల్ల నుంచి/బతుకు ఒత్తిళ్ల నుండి కాపాడి/నీతో ఆడి పాడించేది/నీ బతుకు పండించేది

అసిఫా బాలిక మీద అఘాయిత్యం చేసి, మతముఖం తోడుకున్నప్పుడు

"ఈ దేశం తల్లిని చెల్లిని/ మతమెక్కిన కళ్ళతో చూసే/ సైతానుల ఇష్టారాజ్యం/ కాలం చెల్లి అనుబంధాలు/ కాటేయడానికి ఎప్పుడూ సిద్ధమే"..

అని"క్షమించు అసిఫా "కవిత లో చెప్పాడు.

స్వయంగా గౌడ కులంలో పుట్టి పెరిగిన డా. మడత భాస్కర్ గారు గౌడ కులస్తుల గురించి

"కైలాస ద్వారాల అంచులు తాకి/ అనుపమాన ఆకాశ గంగను/నేలదించిన అభినవ భగీరథుడు"

అని "గౌడన్న గోడు"లో చెప్పాడు.

"బస్సు కిటికీలోంచి/ మానవత్వం చేతులు మారడం/ జీవిత సారాన్ని/ అరటి వండు ఒలిచినట్లు/ చేతికనీదించడం"...

అంటూ "గుడెప్పుడ్ కూడలి " కవితలో కూడ పెట్టుకున్న అనుభవాన్ని చెప్పాడు.

టెక్నాలజీ భ్రమల్లో/ బతుకని ఈడుస్తున్న మనకు/ ఎదురు చూపుల్లోని /హృదయం అర్థం అవుతుందా

అని "స్నేహమేరా జీవితం "లో ఆవిష్కరించాడు.

అడవి తల్లి ఆలంబనగా/ పచ్చని పంట పొలాలతో/ పట్టు చీర కట్టుకున్న/ నిండు ముత్తైదుల/ నాట్యమాడినప్పుడుఅంటూ "జల నిధుల "కవిత లో వర్ణిస్తాడు.

మరుగున పడిపోయిన నైతిక విలువలను మళ్లీ ఆచమనం చేయాలని కవిమడత భాస్కర్ ఆకాంక్షిస్తున్నారు .పైసల చెట్టు స్థానంలో ప్రేమాభిమానాల చెట్టు వర్ధిల్లాలని కోరుకుందాం. ఇలాంటి కవితలు మరెన్నో అతని కలం నుండి జాలువారాలని ఆశిస్తూ, మానవతా విలువల ప్రతిష్టాపనకు కలంతో కవిత్వ వెత్తిన కవి గారికి అభినందనలు.

పుస్తక ప్రతులకు:
శ్రీమతి మడత సంధ్య
వినాయక కాలనీ
నాయుడు పెట్రోల్ పంపు దగ్గర,
వరంగల్
చరవాణి:8919328582

–యాడవరం
చంద్రకాంత్ గౌడ్
9441762105

నాన్నకు ప్రేమతో

అమ్మ ఆత్మీయ స్నేహితురాలు
నాన్న చీకట్లో ఒక వెలుతురు
అమ్మ స్పర్శ అలిసిన మనసుకు శాంతి
నాన్న జీవన జ్యోతి
అమ్మ కు రెండు అక్షరాలు
నాన్నకు రెండు అక్షరాలు
అమ్మ ప్రేమకు ప్రతిరూపం
నాన్న ఒక భరోసా
నాన్న ఒక ఆసరా.

అమ్మ మనతోనే ఉంటుంది
నాన్న మాత్రం నువ్వు లేవక ముందే
ఇంటినుంచి వెళ్లిపోతాడు
నువ్వు నిద్రపోయాక
ఇంటికి చేరుకుంటాడు.

పాపం ఎప్పుడనగావెళ్లాడో
ఏమి తిన్నాడో ఏమో
నీ కడుపు నింపడానికి
తన కడుపు కన్నీళ్లతో
నింపుకుంటాడు.

నాన్న నీకు కొత్త బట్టలు కొంటాడు
నువ్వు ధరించిన నాడు
చూసి పొంగిపోతాడు
కానీ నాన్న పాత బట్టలతో కాలం
వెళ్లదీస్తుంటాడు
తన గురించి తాను ఏమి మిగుల్చుకోడు.

నాన్న నీ అవసరాలు
తీర్చడం కోసం కొవ్వొత్తి లాగా
కరిగిపోతూనే ఉంటాడు
కాలం కరిగిపోతూనే ఉంటుంది
నాన్న కండలు కరిగిస్తూనే ఉంటాడు
నాన్న వయసు ఉడిగిపోతూఉంటుంది
నాన్న కష్టపడుతూనే ఉంటాడు
నాన్న నీ ప్రేమను మాత్రమే కోరుకుంటాడు
నాన్న రెండుసార్లు సంతోష పడతాడు
నువ్వు ప్రయోజకుడు అయ్యినపుడు
నువ్వు ఆయన ఇంటిపేరును
గర్వంగా నిలిపినపుడు
మరి నాన్నను
సంతోషపెడదామా

–అరుణ డేనియల్
9000606889

కలం గళం

అక్షరాభ్యాసంతో ఆరంభమై..
అంతిమ ఘడియల దాకా
విజ్ఞానవికాస సిరా ఊట బాయి
అంగీ జేబుకే అంగమైన కలం !

పలుకే బంగారమైన పెన్ను..
విస్రొటనమై మేల్కొలుపు..
కళ్లేలేని కమణీయ కలం పాళీ..
నేర్పుతో సమస్తాన్ని చూపు !

మూగతానైననేమి..
నా కలమే గళమైంది
నిర్జీవమైతేమి కలం పాళీ..
అక్షరశిల్పాన్ని చెక్కే ఉలి!

కలం తడబడిన ఘడియ..
తిరోగమన తికమకలే
పెన్ను అడుగులు ఆగితే..
భావాక్షర జననం ప్రశ్నార్థకమే!

పెకిలిన పెన్ను గళం లోంచి..
ఆలోచనామృతం ప్రవహించు
అజ్ఞానాంధకారాల్ని హరిస్తూ..
కీర్తి కిరీటమై నన్ను దీవించు !

నన్ను నడిపించే సారథి
దూరాల్ని కలిపే వారధి
నా విలువను పోషించే పెన్నిధి
నన్ను నాకు పరిచయం చేసిన నేస్తం!

కలం గళమెత్తిన నాడు..
అక్రమార్కుల గుండెల్లో గుబులు
అవినీతి జ్వాలల అగ్నిమాపకం
ప్రతినాయకుల వెన్నులో వణుకు !

పాళీ పారాలంటే..
జరగాలి మేథోమథనం
మదిమర్మాలు తేటతెల్లం
పదునెక్కాలి కలం కరవాలమై !

–మధుపాళీ
9949700037

స్నేహం విలువ

రామాపురం అనే గ్రామంలో ముగ్గురు మిత్రులు ఉండేవారు . వారు రాము , భీము , రాజా. వీరు రోజు పాఠశాలకు వెళ్ళేవారు .రాము బాగా చదివేవాడు . భీము మరియు రాజా కాలక్షేపం చేసేవారు . రాము పాఠశాలలో చదువులో ఎప్పుడూ ప్రథమ స్థానంలో ఉండేవాడు . రాము శ్రద్ధగా పాఠాలు వినేవాడు . భీము , రాజా మాత్రం ఎప్పుడు ముచ్చట్లు పెడుతూ , పాఠాలు వినకుండా కాలక్షేపం చేసేవారు .

పరీక్షలు దగ్గరికి వచ్చాయి . రాము అందుకు సిద్ధంగా ఉన్నాడు . భీము రాజా మాత్రం ఆందోళన పడుతూ సమయాన్ని వృధా చేస్తున్నారే తప్ప చదువు పైన శ్రద్ధ పెట్టడం లేదు .మళ్ళీ కాలక్షేపం చేస్తున్నారు . భీము , రాజాలకి రాము మీద కొంచెం ఈర్ష్య ' మరియు కోపం ఉండేది . అయినప్పటికీ వారు ముగ్గురు కలిసి ఉండేవారు . రాముకు తన మిత్రులు సమయాన్ని వృధా చేయడం నచ్చలేదు . అప్పుడు రాము వెంటనే భీము , రాజాల దగ్గరికి వెళ్ళాడు . వారికి పాఠాలు . అందులోని ముఖ్యమైన అంశాలను బోధించాడు . వారిద్దరు చక్కగా విన్నారు.

పరీక్షలు మొదలయ్యాయి . అందరు బాగా వ్రాసారు . పరీక్షలో రాముది ప్రథమ స్థానం మరియు రాజా , భీములకు ద్వితీయ స్థానం వచ్చింది . వారు ముగ్గురు చాలా సంతోషపడ్డారు. మళ్ళీ యధాతథంగా పాఠశాలలో పాఠాలు మొదలయ్యాయి . రాము పాఠాలు శ్రద్ధగా వినేవాడు . కానీ వీళ్లిద్దరు మళ్ళీ సమయాన్ని వృధా చేస్తున్నారు . చంద్ర రాజా భీముల దగ్గరికి వచ్చి వారితో ఇలా అన్నాడు " మీరు సమయాన్ని ఎందుకు వృధా చేస్తున్నారు , పాఠాలను ఇప్పటికైనా శ్రద్ధగా వినొచ్చుకదా " .

అప్పుడు రాజా . భీము "నీకు అవసరమా అని గర్వంతో సమాధానం ఇచ్చారు "రాము లేకపోతే మేమే ప్రథమ స్థానంలో ఉండేవాళ్ళం " అని అన్నారు . కొన్ని రోజుల తర్వాత రాము వాళ్ళ నాన్నకు బదిలీ అయింది . వారు వేరే ఊరికి వెళ్ళారు . తన మిత్రులను విడవటం రాముకు చాలా బాధ కల్గించింది . రాజా , భీము మాత్రం సంతోషపడ్డారు.

కొన్ని రోజుల్లో పరీక్షలు మొదలయ్యాయి . రాముకి తన మిత్రులు గుర్తుకువచ్చారు . వారు పరీక్షలు ఎలా రాస్తారో అని బాధ పడ్డాడు.పరీక్షలు ముగిసాయి . రాము ఎప్పటిలాగే కొత్త పాఠశాలలో కూడా ప్రథమ స్థానం సంపాదించాడు . రాజా ,భీము మాత్రం అందరికంటే చివరి స్థానం సంపాదించారు . వారు అప్పుడు బాధపడ్డారు .

"రాము ఉంటే ఎంత బాగుండో నని,రాము పాఠాలు అర్థం చేయించడంలో సహాయం చేసేవాడు కదా!"

ఆ రోజు నుండి భీము ,రాజాలు కూడా చదవడం మొదలుపెట్టారు. పరీక్షల్లో విజయం సాధించారు.

–మట్టి ప్రసన్న
జక్కాపూర్ , సిద్దిపేట జిల్లా
9959007914

ఆలోచనలతో ఆటలొద్దు...

కొన్ని ఆలోచనలు
దేవతలై దీవిస్తాయి...
కొన్ని ఆలోచనలు
భూతాలై భయపెడతాయి...

కొన్ని ఆలోచనలు
భగ్గుమనిమండే అగ్నిపర్వతాలు...
కొన్ని ఆలోచనలు
కుంభవృష్టిని కురిపించే కారుమేఘాలు...

కొన్ని ఆలోచనలు
కృంగదీస్తాయి కుమిలిపోయేలా చేస్తాయి...
కొన్ని ఆలోచనలు
లేని గుండెధైర్యాన్ని మొండి ధైర్యాన్నిస్తాయి...

కొన్ని ఆలోచనలు
ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించేలా చేస్తాయి...
కొన్ని ఆలోచనలు
నిర్దాక్షిణ్యంగా అధఃపాతాళానికి నెట్టేస్తాయి...

అందుకే వొద్దువొద్దు
మన ఆలోచనలతో ఆటలొద్దు
మన ఆలోచనలను
మనమే ప్రేమించాలి...
మన ఆలోచనలను
మనమే నియంత్రించుకోవాలి...
మన ఆలోచనలను
మనమే ఆరాధించాలి ఆస్వాదించాలి...

–పోలయ్య కూకట్లపల్లి
9110784502

రక్త దానం

రక్తదాతలు
మీరు మా ప్రాణదాతలు
అత్యవసర సమయంలో
ఆదుకునే అపద్బాంధవులు
మీరిచ్చే రక్తం ఒక ప్రాణం
బ్రహ్మ ప్రాణం పోస్తే
ఆపదలో ప్రాణం పోసే
మరో బ్రాహ్మలు మీరే
రక్తం దొరక్క అందుబాటులోలేక
ప్రాణాలు వదులు తున్నది ఎందరో
రక్తదానం పై అపోహ వద్దు
ఎన్ని మార్లు రక్తదానం చేసిన
మన ఆరోగ్యానికి లేదు ముప్పు
కావాలి చైతన్య దీప్తి
బంధాలు అనుబంధాలు
లేకుండా రోగుల సేవలో
తరించే అవకాశం
రక్తదానం ప్రాణదానం
డోనేట్ బ్లడ్.. సేవ్ లైవ్

–వి.శేషారావు
9440408080

పుస్తక సమీక్ష

హాయి గొలిపే గొల్లపెల్లి 'భావగీతాలు...!'

మల్లెలు పూసే నామదిలో
అది ఏ మాసమైనా మధు మాసమే
వెన్నెల కాసే నా తలపులలో
అమావాస్య నిశిలోను ఆహ్లాదమే' అంటూ కవి గొలపెల్లి రాంకిషన్ (రాఖీ) గారు 'హాయి హాయిగా'.. పేరుతో భావ గీతిక మాలికను ప్రకటించారు. సంగీతం.. సాహిత్యం రెండింటిలోనూ ప్రవేశం కొంత ప్రావీణ్యం ఉన్న ఆయన వృత్తిరీత్యా తెలం గాణ గ్రామీణ బ్యాంక్ సీనియర్ మేనేజర్గా ఉద్యోగ విరమణ చేశారు. 'ఇదీ తెలుగు దేశం,' 'నా-నీ ధర్మపురం నరహరి శతకం లో సాహితీరంగాన అడుగుడిన ఆయన భక్తి గీతాలతో పాటు కవిత్వాన్ని వివిధ ప్రక్రియల్లో సృజనచేస్తూ.. బహుగ్రంథకర్తగా అందరి మన్ననలు పొందుతున్నారు. ఆడి యో ఆల్బమ్స్ వెలువరించిన అనుభవమూ ఆయన కు ఉంది.

ఆత్మానందానుభూతినిచ్చే విధంగా హాయిగా చదువుకోవడానికే గాక.. గానయోగ్యంగా మలుస్తూ 108 భావ గీతాలకు ఈ గ్రంథంలో చోటు కల్పిం చారు. నేటి సమాజం లోని జీవన సత్యాలను ప్రతిబింబిస్తూ ఆయన రాసిన గీతాలు హాయి గొలిపే విధంగా కొలువుదీరాయి.

రమణీయ భావాలతో ప్రణయ మాధుర్యాన్ని దాంపత్యం, శృంగారం తో పాటు ప్రేమ.. స్నేహం వంటి అంశాలను తమ గేయాలకు వస్తువులుగా మలచుకొన్న ప్రకృతి సోయ గాలను దృశ్య మానం చేశారు. అంతేగాక సామాజిం కాంశాలు.. జీవన సత్యాలు, భగవదారా ధాన వంటి అంశాలూ ఈ గీతాల్లో మనకు తారసపడతాయి.

చిట్టి చినుకా నువు తాకగానే
మట్టికూడ పరిమళించులే
రామచిలుకా నువు తలుచుకుంటే
జాతకాలై మారిపోవులే
ఉడత లేనిదే రామాయణం లేదులే
బుడత లేనిదే భాగవతం లేదులే

అంటూ **'చిట్టి చినుకా నువు తాకగానే"** గీతాన్ని ఆరంభించిన తీరు బాగుంది.

'అందాల చందమామా' గీతంలో అందాల చందమామా-నీ మీద ఎంత ప్రేమా.. కలగన్న కలువ భామా ఇల నిన్ను కలువ తరమా! అంటూ అందాల చందమామ గీతానికి సమకూర్చిన పల్లవి బాగుంది. మిగతా రెండు చరణాల్లోనూ కవి పండించిన భావాలు గేయంలో చక్కగా ఒదిగిపోయాయి.

కవి రాంకిషన్గారు హృద్యంగా రూపు దిద్దిన ఇందలి గేయాలు.. ఆనందా నుభూతులను పంచుతాయి. ఆయన గేయాల్లో జీవితం ఉంది. జీవం ఉంది. అన్నింటికి మించి జీవన గమ్యముంది. భక్తి వేదాంత భావనలను.. అద్వైత దృష్టి ప్రణయ రస మాధుర్యాలను, ప్రకృతి రమణీ యతను, దాంపత్య శృంగారాన్ని కల్మషంలేని

ప్రేమానురాగాలను ఇలా.. అలవోకగా కవి తమ గేయాల్లో ఆవిష్కృతం చేసి అందరినీ మెప్పించారు. అలరింపజేశారు.

పసిడికి (కవి) తావబ్బితేనే పరిమళాలు వెదజల్లినట్లు.. సంగీతం సౌందర్యరాశి.. సాహిత్యం కుదిరితేనే పరిపూర్ణత విలసిల్లు తుందన్న విషయం తెలిసిన కవి తన గేయా లకు గాన యోగ్యత ఉండేందుకు సాహితీ పరిమళాలను అద్దారు.

ప్రేమించి చూడు..
విరహం చవిచూడు
స్నేహించునేడు..
వీడ్కోలొకనాడు
ఆశిస్తేనే భంగపాటు..
స్వీకరిస్తే ఏదైనా
భేదానికి ఉండదు చోటు.. అంటూ రాసిన గేయంలో ఆనందం విశ్వజనీనం- ఆనందం ఆత్మగతం అని తేల్చి చెప్పారు-

నాలోని అణువణువున ఆవరించివున్న అహంకారమంతటినీ అణచి వేయవ య్యా..

తప్పటడుగు వేయించకు తప్పులు చేయించకు

పదిమందిలో నన్నెపుడు ప్రభూ పలుచన చేయించకు" అంటూ మరో గేయం ద్వారా వేడుకున్నారు.

ఆశలు అవనిని విడిచిన వేళా
కోరిక నింగిలో నిలిచిన వేళా
గగనమే గమ్యమై-గమ్యమే రమ్యమై
పరుగులు వేసింది ఈనాడు మది
ఎందుకో అంటూ "ఎందుకో ఎందుకో నా ఎద" గేయాన్ని రూపుదిద్దారు.

"ఒక మౌనం పలికింది" గేయంలో ఒక మౌనం పలికింది.. ఒక మోడు చిగురించిం దంటూ రాశారు. హృదయవీణ మీటగానే ప్రణయరాగ మొలికింది.

కలం రాయని రాతలెన్నో కన్నీళ్ళు రాస్తాయి

ఎవరు చూడని లోతులెన్నో ఎదలో ఉంటాయంటూ మరో గేయ కవితలో కవి ప్రకటించిన భావాలు ప్రశంసనీయంగా ఉన్నాయి.

దాహం ఊహాతీతమంటూ.. రాసిన గేయంలో దాహం మోహాన్వితమనీ.. దాహం జీవనామృతమని.. దాహం ప్రాణికోటి వాంఛితమని ప్రణయ దాహం విరహం అని..జీవాత్మదాహం పరమపదమంటూ.. దాహం గురించి విభిన్న కోణాల్లో ఆవిష్కరించారు.

పాటపై ఉన్న మక్కువను చాటి చెబుతూ 'పాటగా మారిపోతా' కవితను రూపుదిద్దారు. ఈ కవితలో పాటగా మారిపోతా.. పరవశాన్ని పంచిపెడతా.. నేనుగా శూన్యమైపోతా.. ఎద ఎదలో చొరబడతా.. నంటూ రాసిన పంక్తులు సంగీతం.. పాటకై కవి రాంకిషన్గారికి ఉన్న శ్రద్ధాభక్తులను ప్రకటించేలా కొలువుదీరాయి.

పడతి యొక్క ఔన్నత్యాన్ని తెలియజెప్పుతు రాసిన గేయంలో ప్రకృతికి పడతికీ వున్న పోలికను విశ్లేషించారు.

ప్రకృతికీ పడతికీ ఎంతటి పోలిక అందుకే సృష్టికీ అతివ ఏలిక అని నొక్కి చెప్పారు. లలనలోన అణవణువు జగతిన సుందరతావు.. కవులెంత వర్ణించినా జిలుగులెప్పుడూ తరిగిపోవు అని చెప్పడం బాగుంది.

కవి గురించి.. కవికి గల పరి మితులు ఆంక్షలను ప్రస్తావిస్తూ "సిత్ర మే" కవి బతుకు శివుడా" గేయాన్ని రాశారు. నవరసాలొలి కంచ తగినదే గద సాహితి.. కాని కవికి స్వేచ్ఛలేదనీ.. కట్టడితో కమనీయ కావ్యాలు పుడతాయా?.. ఆంక్షలతో అక్షరాలు తీర్చునా లక్ష్యాలు అంటూ వాపోయారు.

స్నేహానికి నిర్వచనం చెబుతూ మరో గేయాన్ని ఇందులో పొందు పరిచారు. సృష్టిలో తీయనిది స్నేహ మేనని.. చెలిమిని మించిన పెన్నిధి లేదని అంటూ స్నేహాన్ని చక్కగా ఆవిష్కరించారు.

ఇలా ఇందులో భావగీతాలెన్నో ఉదహరించడానికి యోగ్యంగా ఉన్నాయి. సం గీతం.. సాహిత్యం తెలిసిన కవి రాంకిషన్ గారు విభిన్న కవితా వస్తువులతో పాఠకుల కు హాయిగొలిపేలా.. గానయోగ్యంగా రాయడం అభినందనీయం.

ప్రతులకు:గొల్లపెల్లి రామ్కిషన్
ఇ.నెం.3-217/11
రోడ్నెం.14-నార్త్, ప్రశాంతిహిల్స్,
హైదరాబాద్-500 097

– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

ముదిగొండ శివప్రసాద్కు సినారె పురస్కారం ప్రదానం

ఆచార్య ముదిగొండ శివప్రసాద్కు సినారె పురస్కారం ప్రదానం చేస్తున్న జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి. వేదికపై బైస దేవదాసు, ఓలేటి పార్వతీశం, డా॥ వి. భాస్కరరాజు, డా॥ అక్కిరాజు శివరామకృష్ణ, ఎస్.వి.రామారావు, కిన్నెర రఘురాం

కిన్నెర ఆర్ట్ థియేటర్స్ త్యాగరాయ గానసభ సంయుక్తాధ్వర్యంలో డా॥ సి. నారాయణరెడ్డి జయంతి సందర్భంగా చారిత్రక నవలాచక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్కు సినారె సాహితీ పురస్కార ప్రదానోత్సవం జరిగింది. శనివారం గానసభ లోని కళా సుబ్బారావు కళావేదిక లో జరిగిన కార్యక్రమంలో పట్నా హైకోర్టు విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ ఎల్. నరసిం హారెడ్డి హాజరై శివప్రసాద్కు అవార్డును అందజేసిన అనం తరం ఆయన్ను సన్మానించి మాట్లాడారు. ఈ సందర్భంగా సాహితీ సవ్యసాచి లఘుచిత్ర ప్రదర్శన నిర్వహించారు. ప్రముఖులు డా॥ఓలేటి పార్వతీశం, డా॥ అక్కిరాజు సుందర రామకృష్ణ, బైన దేవదాసు, డా॥వి. భాస్కర రాజు, ఎన్.వి.రామారావు, రఘురాం, తదితరు లు పాల్గొన్నారు.

చేజారిన కల. ...

జీవితం గేలానికి
చిక్కుకున్న చేపలా
చేతికి దక్కకుండా
తృటిలో చేజారిన కల లా
ఒడ్డుకు చేరలేని
బలహీన అలలా
చెట్టుకు తట్టిన
గాలిపటం లా
గుండుకు కట్టిన
లేగదూడ లా
ముందుకూ వెనక్కూ
ఊగిసలాడుతుంది
కాళ్ళను బంధించిన
కాలం కలలను
చేజార్చుకున్న ఆకాశమై
మినుగు లను పట్టలనే
ఆరాటంలో భ్రమలో
సూర్యుడి ఉనికిని
కోల్పోయిన జీవితాలెన్నో.

– డా. శ్రీష్టి శేషగిరి
9290652632

డా॥ వడ్డేపల్లి కృష్ణకు, డా॥సుద్దాల అశోక్తేజకు సినారె విశిష్ట పురస్కారాలు

ఆచార్య సి.నా.రె. జయంతిని పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్యగు ఆకునూరి శంకరయ్య ఆయన స్మారకంగా డా॥ వడ్డేపల్లి కృష్ణకు, సుద్దాల అశోక్ తేజకు విశిష్ట ప్రతిభా పురస్కారాలను స్థానిక అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ ద్వారా అందించి సన్మానించారు.

ముందుగా వడ్డేపల్లి కృష్ణ సుద్దాల అశోక్తేజ ఆచార్య సినారెగారి వ్యక్తిత్వం- కవిత్వం గూర్చి సోదాహరణంగా ప్రసంగించి ప్రేక్షకుల్ని రంజింపజేశారు. బాలబాలికలకు చైతన్యస్ఫూర్తిని కలిగింపజేశారు.



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 593 వ రోజు 'రెయిన్ కోట్' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు.'రెయిన్ కోట్'అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...
-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

వరుణాస్త్రం

పురాణాల్లో వాన బాణాలు
అగ్గి పిడుగు బాణాలు
నివారణ అస్త్రాలు అమోఘమట.
సినుకుకు పల్లె పదం
జావళీలు పాడుతుంటే
మనుషులు చిన్నోళ్లై చిందేసేది
వానల తడుసుడు తుమ్ములకు
పసుపు పట్టుకోవడం ఓ మజా కథ.
చక్రాల గుట్ట కు మెరుపొస్తే
చెరువు మత్తడి దుంకే జలకళ
మడికట్టు నాగండ్లు దున్నేయాల
వరుకు అరికట్లం సుట్టుకునేది.
సగం తడిసినంక
వానకు మనసు కారు మబ్బయేది
నాట్లేసే అమ్మలక్కల ఉయ్యాల పాటకు
చెరువు శిఖం శివమెత్తి ఊగేది
వానల తడువని మనిషి
కష్టాల కావడిని మోయని వారు
ఉండరేమో.
వానచినుకులు వయ్యారాలు పోక
మబ్బులు సిల్లు వడ్డట్టు ఒకటే పోత
గాలికి ఊగనిదొకటే వానకోటు రక్షణ
గాలిబుగ్గల తీరు రంగు రంగుల కోట్లు.
పైకం కొద్ది పటాటోపం
ఉన్నోళ్ళకు వర్షం షోకు వానకోటు
లేనోళ్ళకు పనికి తప్పని వానపోటు
ధరకు కరుకైనా గొంగడిని మించింది లేదు
వాడుకుంటే అన్ని కాలాలకు అందివచ్చేను
వానకోటు మంచిదే
తడుపుకు దూరముంచే నెచ్చెలి
వానపాటల యాదిలో గడుసరి.

-ఏడెల్లి రాములు

తడవకుండ కాపాడు

వాన నుంచి మానవ శరీరాన్ని
తడవకుండ కాపాడుతూ ఉండు
తల నుండి పాదం వరకు
నీటితో తడవడాన్నీ ఆపు
తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్ళినా
రక్షణ కవచం
మూలనున్న రెయిన్ కోట్లు
వానకాలంలో బయటికి
వర్షాలు తగ్గాయంటే
మూలకు మంచం
రకరకాల రెయిన్ కోట్లు
స్థోమతకు చిహ్నాలు
రంగులలో విభిన్నం
పనులలో సమానం
ధరలను బట్టి నాణ్యత
దర్పానికి చిహ్నం
శరీరాన్నీ తడవకుండా చేయు
చిరు జల్లు లైనా కుంభవృష్టైనా
భయం లేకుండా శరీరాన్ని
భద్రంగా కాపాడు
వానకాగితమైనా గొడుగైనా
వాహనంపై పోవాలంటే
పనికి రాకుండా పోవు
ఈదురు గాలి వీచిందంటే
ఎగిరెగిరి పారిపోవు
బండి డిక్కీలో ఎపుడు
భద్రం
సైకిల్ మీద పోయేవాళ్ళ
సంచిలో
వర్షం నుండి కాపాడుకోను
వాన కోటు సర్వశ్రేష్టం.

-గుండం
మోహన్ రెడ్డి

వర్షాకాలపు రక్షణ కవచం

సృష్టిలో మనిషికి మాత్రమే వివేకం
ఉష్ణోగ్రతలను మార్చుకోలేని తన దేహం
ఆలోచించింది దాన్ని అధిగమించే ఉపాయం
ఋతువులకనుగుణంగా మార్చింది వస్త్రధారణం
సాగిస్తోంది ఒడుదుడుకులు లేని సుఖ జీవనం.
వేసవి కాలాన నూలు వస్త్రధారణం
కల్పించు వేడిమి నుండి సౌఖ్యం
శీతాకాలాన ఉన్ని వస్త్రధారణం
చలి నుండి ఉపశమనం.
వానా కాలాన రెయిన్ కోట్ ధారణం
తడవకుండా కల్పిస్తుందది రక్షణం
రెయిన్ కోట్ చెంత నుంటే లేదే ఆందోళన
వృత్తికైనా ఉద్యోగానికైనా వర్షాన సుఖ పయనం
కార్యాలయానికి చేరుటకు లేదు సంశయం
పని ప్రదేశ పయనానికి లేదు భయం
విద్యాలయానికి వెళ్ళుటకు లేదే అనుమానం.
ఆడా మగా ఎవరైనా ధరించ గలిగే సౌకర్యం
రెయిన్ కోట్ కు ఉన్న ఏకైక సౌభ్యం
వానకు తడవకుండా కాపాడే రక్షణకవచం
నిత్య లావాదేవీలకు ఉండదాటంకం
వర్షా కాలాన మన పనులు నిరాటంకం
వర్షాన బయటకు వెళ్లి ఇంటికి చేరే సమయం
కల్పిస్తుందది ఇంటివారికి అందరికీ అభయం.

-జె.వి.కుమార్ చేపూరి

రెయిన్ కోట్

ఉ. ఉర్విని యాకు కుట్టుకును చోర్మిని వర్షము బాధవీడగా
గర్వము లేక నిశ్చలపు కర్మల నిర్వహణమ్ము మెచ్చెడిన్
పూర్వము తట్టు బొంతలను పొందిక కట్టుచు రైతువృత్తిలో
సర్వముచేసి దేహమును చక్కగ రక్షణ పొందె తృప్తితో!!!
చం. పశువుల గాయు సేవకులు వర్షము తాకక రేను కోటుగా
వశమును జేసి గొంగళులు వైభవ మొంద ధరించి కాయమున్
మశకము కీటకమ్ములను మైత్రిని దూరము చేసి నారుగా
కుశలముకోరిరిగ్గినువికోటులుప్లాస్టికువంటివెన్నియో!!.
ఆ.వె. టేకు టాకు తోడు రీవీగ టోపీలు
తలను వాన బారి దాచు సొగసు
హీన పక్షమందు హెల్మెట్టు నేడయ్యె
రేను కోటు రీతి బ్రేను గాయు!!.
ఉ. జమ్ముసుధాత్రి గొర్రెలది చక్కని బొచ్చువి కోటులెన్నియో
సొమ్ములు ఖర్చు రీతి తగు శోభల కోటు బజారు లోపలన్
నమ్మక ముంచి మేను కడు నానకయుండగగాచునేడిలన్
సమ్మతి వానహమ్ములను శాంతిగ చోదన చేయు వారికిన్.

-మాడుగుల నారాయణ మూర్తి

వేయి అడుగు!?

టప్ టప్ టప్ వర్షపు ధారలు
టక్ టక్ టక్ బూట్ల అడుగులు
"నేను లేకుండా వెయ్యి అడుగు!
ఎలా పోతావో చూస్తా"
ఎదురుగా పరిహాసంతో
రెయిన్ కోటు!.
ఆకాశం చిల్లిపడె
పూలజల్లు
చుక్కలు చుక్కల చూపుతూ
జడివానగా మారె!
రెయిన్ కోటు
అమ్మ పొత్తిళ్లలో
మొక్కజొన్న పొత్తు లో
దాగిన కండెలా సాగే జనం!
నిశ్చింతగా వేయు అడుగు!.
పోలీసైనా గుడికెళ్ళే తాతైనా
బడికెళ్ళే బుడతైనా
తలను ఆప్యాయంగా కప్పి
ఒంటిసంతా వెచ్చదనం నింపి.
ఆడమగ తేడాలేని ఒంటిని
అంటిపెట్టుకునే కవచం!
కోరిన రంగుల్లో సైజుల్లో
వాటర్ ప్రూఫ్ రెయిన్ జాకెట్!.
గొడుగు ఐతే మర్చిపోయి
జర్రున చేజారు!
గాలి విసురుతో బేజారు!
ఏడాది పాప మొదలు
బడికెళ్ళే బుడతలు
రంగుల సింగిడీలు
పకపకలాడుతూ
జర్రుబుర్రు జారుతూ
రెయిన్ కోటు కవచంలో
ముత్యపు చిప్పలు!.

-ఎ.రాజ్యశ్రీ

రెయిన్ రాంగ్

వర్షం బాగా పడుతుంది
తడిపీ తడిపీ చంపేస్తుంది
బయటకు రాక తప్పట్లేదు
కరోనా భయం వీడలేదు
ఖర్చులు అన్నీ పెరిగాయి
వాన కోటు కొందామనుకున్నాను
ఖరీదుకై అడిగాను
ఐదు వందలు చెప్పాడు
అయ్యో అని వెనుతిరిగాను
వాన మాత్రం వదలలేదు
నానుడు మాత్రం ఆగలేదు
రోజూవారీగా బయలు దేరాను
వర్షం ధార జేబులన్నీ నింపింది
తుమ్ములు మొదలయ్యాయి
లాభం లేదనుకున్నాను
ఖరీదు వానకోటు కొన్నాను
పొద్దున్నే వానకోటు తగిలించి..
బండిని గేర్లో వేసి
వాన రావే
దమ్ముంటే రావే
అనుకుంటూ
పొగరుగా చూసుకుంటూ
రివ్వున బ్రతుకు సంత
దారిలో వెళ్తున్నాను
వానా లేదు
గాలీ లేదు
వేసుకున్న కోటు
చెమట నింపేస్తుంది
చినుకు జాడ అసలే లేదు
నన్ను చూసి
అందరు నవ్వంగా
మెల్లగ నేను కదిలాను
వానకోటుల వ్యాపారికై
ఎంత చూసినా దొరకక
గొల్లుమన్నాను.

-జె.నరసింహారావు

తెర చాటు

వర్షరుతువు లోని హర్షమ్ము కోటుగా
బయట పనులు సాగు బాగుగాను
తడువనట్టి రక్ష తక్షణమ్మది జూడ
గడుసు మానవునికి గర్వముగను !!.
సిల్కు వంటి బట్ట సింగార మొలికించి
శిరము నుండి దాచు శీఘ్రముగను
ఒడలు తడవనట్టి నొద్దిక తానౌను
రెయిను కోటు లెస్స రెయి పవలు !!.
గోనెపట్ట నాడు గోగునారను సంచి
కప్పుకొంటి రపుడు కార్యమందు
గొడుగు కంటె మేలు గుట్టుదాచును కోటు
బాల వృద్ధులకును బడికిదోస్తు !!.
తడవగాను గల్గు తాపజ్వరములెల్ల
రెయినుకోటుయుండ రిక్కబోవు
ప్రాచ్య దేశసృష్టి ప్రజలకుపకరమ్ము
బండిదోలునపుడు బాగుగాను!!.

-ఎం.వి.ఉమాదేవి

వర్ష రక్షిణి

వాన పోయే
వర్షం వచ్చే..
రెయిన్ వచ్చే..
రెయిన్ కోటే వచ్చే..
పేద వాడిక్కూడా
కోటు తొడిగిన సంబర మిచ్చే..
వాననుంచి రక్షణ
పొందాలంటే ఎన్నో ఉపాయాలు
తాతలు గోనెపట్టా
తాటి గొడుగులు
తండ్రులు గుడ్డ గొడుగులు
మనం రెయిన్ కోట్లు
వాన అప్పుడూ ఇప్పుడూ ఒకటే..
వరుణదేవుని కృపే..
చిరుజల్లులైనా
ధారాపాతమైనా
మూల దాచిన
రెయిన్ కోటు కోసం
వెతుకులాట
విశ్రాంతి లోనున్న
కోటు బద్ధకించినా
దానికి
పని చెప్పక తప్పదు...

-మోటూరి శాంతకుమారి

వానరక్షకం

మేఘావృతమైన ఆకాశం
ఏదో సందేశం
పసిపిల్లల మనసులు
సంతోషంతో పురకలు
వానలు కురవాలీ
పరిచేలు పండాలి
మా అమ్మ వండాలి
మా బొజ్జ నిండాలి
బుడుగో బుడుగు.
కొందరు పాడుతూ ఉంటే
ఆడపిల్లలు వానా వానా వల్లప్ప
వాకిలి తిరుగు చెల్లప్ప అని
ఒకరి చేతులు ఒకరు పట్టుకుని
ఒప్పులకుప్ప తిరుగుతూ వుంటే
వున్నట్టుండి
ఉరుములు పిడుగల చప్పుడుకి
దుబుక్కుమని
చెట్టుతొర్రలోకి వుడుత దూరితే
లోపలకి రండర్రా అన్న
పెద్దల గొంతులు
ఆ ఉరుము శబ్దానికి తాళం .
కష్టాలు వచ్చినా
విపరీతమైన ఆనందం కలిగినా
కారేవి కన్నీళ్ళే
వర్ష సందేశం.
పిడుగులు, ఉరుములతో
కూడిన జల్లులైనా
తుఫానుతో కూడిన వర్షమైనా
ఋతువులకి బంధువులైనా
వాసలైనా అన్నీ ఒక్కటే
మనిషి కన్నీరులా
దాని అర్థం ఒక్కటే
ఇదే వర్షం రైతన్నకి సంతోషం
కానీ దాని నుండి కావాలి రక్షణ
అందుకే ఛత్రం.

-కె. కె. తాయారు

విదేశాలలో వెల్లివిరుస్తున్న భారతీయ సాంస్కృతిక సౌరభాలు- డా॥ఎం.కె.రాము

బాల కళాకారుల ప్రతిభలు పరిమళించిన భారతీయ సాంస్కృతిక సౌరభాలు విదేశాలలో వెల్లి

డా॥ రూప (అమెరికా)

నర్తనబాల శ్రేయాంశి

చిన్నారులు అక్షత, ఆద్యలు

కళాకారులతో అతిథులు రత్నాకరశర్మ, శ్రీమతి కందాళ హరిణి, శ్రీమతి మయూరి శంభుని, డా॥రవికుమార్, బైసదేవదాసు, డా॥ఎం.కె.రాము, ఎం.కె.ఆశాలత, శ్రీమతి భారతి.

విరుస్తున్న భారతీయ సనాతన సాంప్రదాయ కళలైన సంగీత నృత్యాల వైభవం మన కళల గొప్పదనానికి ప్రతీకగా నిలుస్తున్నాయని ముఖ్య అతిథిగా విచ్చేసిన రసమయి అధ్యక్షులు ప్రముఖ కవి బాలబంధు డా॥ ఎం.కె.రాము ప్రశంసించారు.కోవెల కళానిధి అమెరికా ,శ్రీ సచ్చిదానంద కళాపీఠంల సంయుక్త నిర్వహణలో నర్తకీ మణి డా॥రమ్య సారథ్యంలో తెలంగాణా సారస్వత పరిషత్తు హాలులో జులై 26న జరిగిన భారతీయ సాంస్కృతిక సౌరభాలు కార్యక్రమానికి ఆయన హాజరై బాల కళాకారులను దీవించి ప్రసంగించారు.ఈ సంస్కృతి ని తన కర్తవ్యంగా కొనసాగిస్తున్న తల్లి తండ్రులు,గురువులు ,సమాజము సజీవం చేస్తూ ముందు తరాల వారికి అందిస్తున్న కృషి కొనియాడదగినదని అన్నారు.ఒక దేశ వారసత్వం ఔన్నత్యం తెలుసు కోవా లంటే ఆ దేశపు కళలే శ్రేష్టమైన మాధ్యమాలని, బాల కళా వికాసాలకు చేయూత నిస్తున్న వ్యక్తులు సంస్థలు వారితో వ్యాపారం చేయడం మాని వారి కళా ప్రగతికి దోహదమిచ్చే చైతన్యాన్ని కలిగించాలని,కళల పట్ల మన సంస్కృతీ సాంప్రదాయాల పట్ల వారికి ఆసక్తి కలిగించే కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. తాను పిల్లలు నృత్య రూపకాలు రాసి ప్రదర్శింపజేశానని,ఏక కాలంలో పలు జిల్లాలలో పోతన భాగవత పద్య పఠన పోటీలు నిర్వహించి బహుమతు లిచ్చిన మధుర జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. జవహర్ బాల భవన్ సంచాలకులుగా ప్రభుత్వాలను ఒప్పించి పలురంగాల ప్రతిభావంతులైన బాల కళాకారులకు "బాల శ్రీ" అవార్డుల ప్రదానం చేయడంలో కృషి చేశానని తెలిపారు. ఇప్పుడు ఏలికలు ఆ విషయం మరచినా ఆ సంస్కృతిని కొనసాగిస్తూ తాను ప్రతీ ఏటా వివిధ రంగాలలో రాణిస్తున్న బాల కళాకారులకు రసమయి ఉగాది బాల పురస్కారాలు అందజేసున్నాని అన్నారు. ఇది ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఈ బాల కళాకారులే మన సాంస్కృతిక రాయబారులని అన్నారు. ప్రముఖ వ్యాఖ్యాత్రి ఎం.కె.ఆశాలత ఒక సాంప్రదాయానికి ఆచరణకు ప్రదర్శనలకు ఈ కార్యక్రమం సజీవ తార్కాణమని,బాల కళాకారులలో ఒక నిత్య వసంతం వెల్లి విరియాలని, సంస్థలు బాల కళా ప్రదర్శనలకు ఎక్కువ విలువ నీయాలని అన్నారు.తొలి పలుకులలో డా॥రమ్య మాట్లాడుతూ అమెరికాలో మన సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తారని,తాను డాక్టరు నైనా నర్తకినని ,తన కూతురు ,కొడుకులు కూడా నర్తకులే నని తెలిపింది.మాతృ భాష, మాతృ దేశమంటే మక్కువ కలిగించే రీతిలో తన బిడ్డలను తీరిచి దిద్దుతున్నానని, ప్రతీ నెల అంతర్జాలంలో కళాపీఠం తో కలిసి తెలుగు బాల కళాకారులు, అమెరికా కళాకారులతో కలిసి అంతర్జాలంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.తన మాతృగడ్డ పై ఈ కార్యక్రమాన్ని ప్రదర్శించడం చాలా సంతోషంగా ఉన్నదని అన్నారు. నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు అధ్యక్షోపన్యాసం లో బాల కళాకారుల ప్రతిభలు గుర్తించి వారికి ఆదిశగా చేయూత నివ్వవలసిన అవసరం ఉందని,ఇది కేవలం తల్లిదండ్రుల తోనే సాధ్యమని, సానపెట్టె గురువులు దొరకాలని ఇతర దేశాలతో పోలిస్తే మనదేశంలో బాల కళాకారులకు ఇస్తున్న ప్రోత్సాహం తక్కువేనని అన్నారు.రంగుల హరివిల్లుగా సాగిన ఈ వేడుకలలో అంతర్జాతీయ పర్సనాలిటి డెవలప్ మెంట్ ప్రముఖులు డా॥ రవికుమార్ మాట్లాడుతూ బాలలకు చిన్న తనం నుండే పర్సనాలిటి డెవలప్మెంట్ పై అవగాహన పెంచాలని అన్నారు. సంగీత గురువు శంభుని మయూరి, నాట్య గురువు కందాళ హరిణి,ప్రముఖ వైద్యురాలు,నర్తకి డా॥ రాజ్యశ్రీ, విశ్రాంత అధ్యాపకు రాలు భారతి లు అతిథులుగా పాల్గొని నిర్వాహకులను బాల కళాకారులను అభినందించారు.ఒక విలక్షణ రీతిలో బాలలే నిర్వహించిన ఈ సంబరాలలో కార్యక్రమ వ్యాఖ్యాత్రులుగా కుమారి నిత్యశ్రీ తెలుగులో,చిన్నారిచిట్టి రూప(అమెరికా)ఇంగ్లీషులో కమనీయ మైనరీతిలో ఈ కార్యక్రమానికి పెద్ద ఆకర్షణగా నిలచారు.బాల కళాకారులు కన్న, నిత్యరూప,అశ్మిత, శ్రేయాంశి, అక్షత, ఆద్య, సాయిశ్రీ, మహిశ్రీ ల సంగీత నృత్య పద్యపఠన సౌరభాలు అతిథులను ఆహూతులను ఆకట్టుకుని ప్రశంసలందుకు న్నాయి. డా॥రమ్య ,కన్న,రూపల అష్టలక్ష్మి స్తోత్ర నృత్య రూపక ప్రదర్శనకు సభ కరతాళ ధ్వనులతో స్పందించింది. విఘ్నరాజు ను స్మరిస్తూ నిత్యశ్రీ గణపతిపై పాడిన పోతన మాహాభాగవత పద్యంతో ప్రారంభమైన ఈ సాంస్కృతిక సంబరాలలో ముందుగా రూప ,కన్నల వినాయక కౌతం,ఒక ప్రవోద ఆకర్షణగా నిలవగా, రమ్య "వేంకటాచల నిలయం" కీర్తనపై సమర్పించిన కూచిపూడి నృత్యం,అన్నమయ్య సంకీర్తన "విన్నపాలు వినవలే" పై చిన్నారి రూప నాట్యం రసరమ్యం కాగా ,మండూక శబ్దం పై కన్న,కమనీయంగా రమణీయంగా భాగవత పద్యాలు ఆలాపించిన అశ్మిత, "ఇదిగో భద్రాద్రి" పై రూప మనోహర నృత్య హేల,చిట్టి చిట్టి చిన్నారులు అక్షత,ఆద్యలు మధురంగా ఆలాపించిన "శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం" శ్లోకం,తల్లి కూతురు కొడుకులు కలిసి చేసిన మధురిమలు,కైలాసంలో శివుని నృత్యాన్ని నింగి నుండి నేలకు దింపిన శివాష్టక నృత్యం,బృందావనంలో రాధికతో కృష్ణుడు ఆడుకున్న అనుభూతిని కల్పించిన చిన్నారి శ్రేయాంశి "ధనశ్రీ థిల్లానా" నృత్య సన్న జాజుల పరిమళాలు ఈ సంబరాలలో ఇంద్రధనసై కనివిందు చేసి వీక్షకుల హృదయాలలో చెరగని ముద్ర వేశాయి.మంగళంతో ముగించి శాంతి మంత్రం అందరితోనూ పలికించిన పవిత్రత సత్సాంప్రదాయపు ఆణిముత్యపు హరిహరులకు మంత్ర పుష్ప మంగళ నీరాజనమై మూడు తరాలుగా అమెరికాలో ఉంటున్న రమ్య కుటుంబానికి మరవలేని మధుర సాక్ష్యంగా జాబిల్లి వెన్నెలలు కురిపించింది . కళాపీఠం అధ్యక్షులు రత్నాకర శర్మ, ధనశ్రీలు కార్యక్రమ సమన్వయకర్తలు చేశారు.

కన్న నర్తనకేళి

మధుర బాలగాయని అశ్మిత

మధుర బాలగాయనీమణులు బొబ్బిలి సిస్టర్స్ సాయిశ్రీ, మహిశ్రీ

కోవెల కళానిధి (అమెరికా) అధ్యక్షులు డా॥రమ్యారావు.

మాతృభాషను మాతృభూమిని ప్రేమిస్తు కళారంగంలో రాణిస్తున్న డా॥ రమ్యారావు కుటుంబం



కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా'

పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ వలిపే
ఈ సమూహంలో చేరదలచినవారు 89856131238కి మెసేజ్ చేయవచ్చు.

(ప్రథమ)

తీరని ఋణం

అంతరంగాన పదే పదే కదిలే..
భావ తరంగాల
వెల్లువే.. అమ్మ..జ్ఞాపకం.
ప్రతిదీ మాకేదో చెప్పి నేర్పించాలని
ఏనాడు చెయ్యలేదు..
తనను అనుకరించడం లోనే..
అలవాటుగా అందిపుచ్చుకున్న
నైపుణ్య మే అమ్మ.
పసితనాన..
నీవు పంచిన ముద్దు మురిపాలు...
నీ గోరుముద్దల తియ్యదనం...
ఆడిపాడి అలసిన వేళ..
జోలపాడి నిదురపుచ్చు సమయాన..
చల్లని నీ ఒడిలోని...ఆ వెచ్చదనం....
మరువలేని మధురానుభూతి...
ఆడపిల్ల నని ఋజువుకై
ప్రకృతి పరంగా నిరూపణ రోజున
నీ గుండెల్లో ని ఆరాటం..
చదువులు పూర్తిచేసి..
ఉద్యోగం పొందిన నాడు
నాపై నీకు గల నమ్మకం..
ఓ..మరువలేని మధుర జ్ఞాపకం...
నా వివాహం వేడుకలో
ఆనందంతో వెలిగే నీ.. మోము...
ఒక ..మరువలేని మధురానందం..
అత్తవారింటికి పంపే సమయాన...
ఆ క్షణంతల్లిగా..నీ కన్నుల్లో కదలాడిన
కన్నీటి సుడులు..నిండుచూలాలినై..
పురిటినొప్పులు పడుతున్నప్పుడు..
నేను చూసాను..
నీవు దాచిన కన్నీటి పొరలను..
క్షేమంగా ఉన్న నన్ను ...
నా బిడ్డల సేవలలో..తలమునకలైన ..
నీ మోమున..
అలసటను దాచి.. కనపడే ఆ ఆనందం.
మరువలేని మధుర సేవలే..
నీకు బావుండలేదని తెలిసి..
నిన్ను చేరిన.. నన్ను ..
మృత్యువుతో పోరాడుతూ.. కూడా..
మా యోగక్షేమాలడగడం
ఆశ్చర్యచకితులని చేస్తోందమ్మా!!
ఇదే..
నీ తల్లి.. ప్రేమకి..నిదర్శనం..
మరణశయ్యపై..
విగత జీవిగా ఉన్న సమయాన..
నీ నుదుటిని తాకిన ...నాచేయి...
మరువలేని ...చివరి . .క్షణం ..
మరపురాని... చివరిస్పర్శ
ఒకరోజు కొలిచెందుకు
గుడిలోదేవత.. కాదు..
నేడు ఆమె ఈ లోకాన లేకున్నా...
సదా మా గుండె గుడిలో కొలువైన
దేవత..
నింగీ నేలా ఉన్నంత వరకూ
నిత్య నీరాజనాలే మనసున..
అమ్మకు అమ్మ నై పుట్టి
సేవ చేసినా..
వీడలేని బంధమే..
తీరని ఋణమే అమ్మది..

-పోపూరి మాధవీలత

తీరని ఋణం

జానెడు పొట్టకు
గుప్పెడు మెతుకుల దాతలు
ముప్పొద్దులా నడుం వంచే
మానవతకు ప్రతిరూపాలు.
భూమిని నమ్మి
అరకను పట్టి
దుక్కిదున్నే అన్నదాతలు
కరువొచ్చినా
ఎరువులు లేకున్నా
ఆకలిని కుదువబెట్టి
అహర్నిశలు శ్రమించే కర్షకదేవుళ్ళు
అకాల వర్షాలే అరుదెంచినా
త్రికాలాలు అనావృష్టే తాండవించినా
నేలతల్లిని మరువని దీక్షాపరులు
అనునిత్యం ఆశను కంటూ
దేశభవితకు వెన్నుముకను పేరుస్తూ
ఎండిన డొక్కలకు
పట్టెడన్నం పెట్టే ప్రాణదాతలు
సుఖాన్ని కోరని నిస్వార్థజీవులు
నిరాండబరతకు నిలువుటద్దాలు
స్వేదం చిందించి సేద్యం చేసే శ్రామికులు
పుడమి పొరల్లో
పంటకు పురుడుపోసే మంత్రసానులు
అట్టడుగున ఉంటూనే
అందరినీ ఆహార అందలమెక్కించే సైరికులు
ఎన్ని జన్మలెత్తినా
అన్నం పెట్టిన ఆ చేతుల ఋణం తీర్చుకోగలమా
బుక్క నోట్లో పెట్టుకునే ముందు
స్మరించుకోవడం తప్ప!
వారి సేవలకు సదా ప్రణమిల్లడం తప్ప!!

-అయిత అనిత

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.